

డీసీసీబీ చైర్మన్‌గా కోన తాతారావు

- జనసేన కోటాలో ఎంపిక
- రెండు, మూడు రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు



కోన తాతారావు

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌గా కోన తాతారావును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం ఆదేశాలు ఇచ్చింది. ప్రస్తుతం తాతారావు జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా ఉన్నారు. నామినేటెడ్ పదవుల పంపకంలో కూటమి పార్టీల మధ్య ఉన్న అవగాహన మేరకు విశాఖ డీసీసీబీ పోస్టును జనసేనకు కేటాయించడంతో తాతారావుకు అవకాశం లభించింది.

రాష్ట్రంలో సహకార బ్యాంకులు, సొసైటీలకు 2018 తరువాత ఎన్నికలు నిర్వహించలేదు. అప్పటి నుంచీ రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా తమ పార్టీకి చెందిన వారిని చైర్మన్లుగా నామినేట్ చేస్తూ వస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం చివరిలో డీసీసీబీ ... మిగతా 6వ పేజీలో

డీసీఎంఎస్ చైర్మన్‌గా కోట్ని బాలాజీ

- టీడీపీకి అందిస్తున్న సేవలకు దక్కిన ప్రతిఫలం



-8లో

మేయర్ పీఠంపై పీలా



మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావును అభినందిస్తున్న కార్యకర్తలు

ఏకగ్రీవంగా ఎన్నిక

- ప్రత్యేక కౌన్సిల్ సమావేశానికి 59 మంది కార్పొరేటర్లు, ఎనిమిది మంది ఎక్స్‌అఫీషియో సభ్యులు హాజరు
- కార్పొరేషన్ ఏర్పాటైన తర్వాత టీడీపీ నుంచి మేయర్‌గా ఎన్నికైన రెండో వ్యక్తి
- విలువలకు లోబడి, విధానాలకు కట్టుబడి పనిచేస్తానని ప్రకటించిన పీలా
- జీవీఎంసీ కార్యాలయం వద్ద టీడీపీ కార్యకర్తల సంబరాలు



మేయర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న పీలా శ్రీనివాసరావు. చిత్రంలో కూటమి ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, పల్లా శ్రీనివాసరావు, గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, ఇతర నాయకులు

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) నూతన మేయర్‌గా టీడీపీకి చెందిన 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై ఈనెల 19న కూటమి కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఆమె పదవిని కోల్పోయిన విషయం తెలిసిందే. కొత్త మేయర్ ఎన్నిక కోసం సోమవారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జరిగింది. జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మయూర్ ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు.

కౌన్సిల ప్రత్యేక సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. సభకు 59 మంది కార్పొరేటర్లు, ఏడుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ మొత్తం 67 మంది హాజరవ్వడంతో ఎన్నిక ప్రక్రియను ప్రారంభిస్తున్నట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం మేయర్ ఎన్నిక ప్రక్రియకు సంబంధించిన నియమ నిబంధనలను సభ్యులకు ఆయన వివరించారు. ఆ తరువాత మేయర్‌గా పోటీ చేసే అభ్యర్థిని ఎవరైనా ఒక సభ్యుడు ప్రతిపాదించి, మరొక సభ్యుడు బలపరచాలని కోరారు. దీంతో జనసేనకు చెందిన దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కూటమి తరఫున మేయర్ అభ్యర్థిగా పీలా శ్రీనివాసరావును ప్రతిపాదించారు. బీజేపీకి చెందిన ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు బలపరిచారు. ఇంకెవరైనా పోటీలో ఉన్నారా?...అని ఎన్నికల అధికారి ప్రశ్నించగా, సభ్యులంతా ఎవరూ లేరని చెప్పడంతో మునిసిపల్ చట్టం రూల్ నంబర్ 62 ప్రకారం పీలా శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. సభ్యులందరూ ... మిగతా 6వ పేజీలో



పీలా శ్రీనివాసరావుతో మేయర్‌గా ప్రమాణం చేయిస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

నూతన మేయర్ బయోడేటా

పేరు: పీలా శ్రీనివాసరావు
పుట్టిన తేదీ: 17-11-1968
తండ్రి: పీలా మహలక్ష్మినాయుడు రెండుసార్లు పెందుర్తి మండల అధ్యక్షునిగా పనిచేశారు
రాజకీయప్రవేశం: 1985 నుంచి టీడీపీలో క్రియాశీలకం
పార్టీ పదవులు: పెందుర్తి నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు, విశాఖ జిల్లా తెలుగు యువత వైస్ ప్రెసిడెంట్, జిల్లా తెలుగు యువత ప్రెసిడెంట్, 2007-12 వరకు నగర పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, 2021 నుంచి జీవీఎంసీలో టీడీపీ ఫ్లోర్ లీడర్
భార్య: పీలా ధనలక్ష్మి, గృహిణి
కుమారుడు: ధీరజ్‌నాయుడు. **కుమార్తె:** డాక్టర్ జీవితశ్రీ

నగర అభివృద్ధికి నా శక్తిమేరకు కృషి

- ప్రజలకు అందుబాటులో ఉంటా
- సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తా
- వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యం
- వైసీపీ పాలనలో అవినీతిపై సమీక్షించి చట్టప్రకారం చర్యలు
- నూతన మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని ప్రజా ప్రతినిధులందరితో సమన్వయం చేసుకుంటూ నగర అభివృద్ధికి తన శక్తి మేర కృషిచేస్తానని మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావు అన్నారు. మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన జీవీఎంసీ సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు. ఎంతో కీలకమైన మేయర్ పదవిని తనకు అప్పగించిన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్య క్షురాలు పురందేశ్వరిలతోపాటు కూటమి ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లకు రుణపడి ఉంటానన్నారు. సీఎం చంద్రబాబునాయుడును స్ఫూర్తిగా తీసుకుని నగర పరిధిలోని సమస్యల పరిష్కారానికి అలుపెరగకుండా కృషిచేస్తానన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలు తెలుసుకుని ... మిగతా 6వ పేజీలో

దివ్యాంగుల పెన్షన్లు రీ అసెస్‌మెంట్

- జిల్లాలో 21,306 మంది వివరాలు పునఃపరిశీలించాల్సిందిగా ప్రభుత్వ ఆదేశం
- కేజీహెచ్ సహా పలు ఆస్పత్రుల్లో పరీక్షలు
- ఇప్పటివరకూ 49.02 శాతం పూర్తి
- అనర్హులు ఎవరూ పెన్షన్లు పొందకూడదు...
- అర్హులు ఎవరూ నష్టపోకూడదన్నదే లక్ష్యం

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ పొందుతున్నవారి రీ అసెస్‌మెంట్ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రస్తుతం దివ్యాంగుల కేటగిరీలో అనర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం సదరం రీ అసెస్‌మెంట్‌ను చేపట్టింది. జిల్లాలో ఈ ప్రక్రియను అధికారులు జనవరిలో ప్రారంభించారు. కేజీహెచ్, కంటి, ఈఎన్‌టీ, మానసిక ఆస్పత్రులతోపాటు భీమిలి, పెందుర్తిల్లో ప్రతి బుధ, గురు, శుక్రవారాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించి గతంలో పొందిన సదరం సర్టిఫికెట్లలో పేర్కొన్న మాదిరిగా వైకల్యం ఉన్నదీ?, లేనిదీ? పరీక్షిస్తున్నారు.

రెండు కేటగిరీలకు సంబంధించిన పెన్షనర్ల జాబితాను అధికారులకు అందించిన ప్రభుత్వం...రీ అసెస్‌మెంట్ చేయాల్సిందిగా ఆదేశించింది. పూర్తిగా వైకల్యానికి గురై రూ.15 వేలు పెన్షన్ తీసుకుంటున్నవారు ఒక కేటగిరీలో, సాధారణ వైకల్యంతో బాధపడుతూ రూ.6 వేలు పెన్షన్ పొందుతున్నవారు మరో కేటగిరీగా ఉన్నారు. జిల్లాలో రూ.15 వేలు పెన్షన్ తీసుకుంటున్నవారు 319 మంది ఉన్నారు. వారిని ఇంటింటికీ వెళ్లి పరిశీలించేలా అధికారులు వైద్య బృందాలను ఏర్పాటుచేశారు. ఈ బృందాల్లో జనరల్ మెడిసిన్, ఎంబీబీఎస్, ఆర్థో వైద్యులు ఉంటారు. 319 మంది రీ అసెస్‌మెంట్ ప్రక్రియ పూర్తయింది. ఇక విభిన్న ప్రతిభావంతులకు అందించే 6,000 పెన్షన్ పొందుతున్న వారి జాబితాకు సంబంధించి ఐదు కేటగిరీలకు చెందిన లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వం ... మిగతా 6వ పేజీలో

టికెట్లు... ఇక్కట్లు

చందనోత్సవం రోజున అప్పన్న దర్శన టికెట్లకు భారీగా డిమాండ్

- ఇంకా ప్రారంభం కాని వీవీఐపీ టికెట్ల జారీ
- రూ.వేయి టికెట్లు అయిపోయాయంటూ బ్యాంకుల్లో సమాధానం
- కేవలం రూ.300 టికెట్లే విక్రయం



సింహగిరిపై భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సింహాచలేశుని నిజరూప దర్శనం కోసం భక్తులు ఎదురుచూస్తున్నారు. ఉచిత దర్శనానికి కనీసం నాలుగు గంటలు పట్టే అవకాశం, కనీసం పది కిలోమీటర్ల క్యూలో నడవాల్సి ఉండడంతో అత్యధికులు ఏదో ఒక టికెట్ కొని దర్శించుకోవాలని భావిస్తున్నారు. అయితే కేవలం రూ.300 టికెట్ తప్పితే ఇంకేమీ లేవని సింహాచలంలోని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. అవి కూడా బుధవారం మధ్యాహ్న దర్శనానికి మాత్రమే ఉన్నాయని సోమవారం వెల్లడించారు.

దర్శనాల కోసం దేవస్థానం అధికారులు రూ.1,500, రూ.1,000, రూ.300 విలువైన టికెట్లు ముద్రించి విక్రయాలకు సిద్ధం చేశారు. ఇందులో రూ.1,500 విలువైన టికెట్లు వీవీఐపీలకు, ప్రొటోకాల్ దర్శనాలకు ఇస్తామని వెల్లడించారు. అవి సుమారు 2,500 టికెట్లు ముద్రించామని చెప్పారు. అప్పన్న దర్శనం కోసం ఉత్తరాంధ్ర ... మిగతా 6వ పేజీలో

చందనోత్సవానికి సర్వం సిద్ధం

- 2 లక్షల మంది భక్తులకు తగ్గ ఏర్పాట్లు
- రేపు ఉదయం 4 గంటల నుంచి అప్పన్న నిజరూప దర్శనం
- సింహగిరిపైకి భక్తుల సొంత వాహనాలకు అనుమతి లేదు
- దేవస్థానం ఈఓ కొమ్ముల సుబ్బారావు

సింహాచలం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30వ తేదీన వరాహ లక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం (చందనోత్సవం) కోసం రెండు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేసి, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు పూర్తిచేసినట్టు దేవస్థానం ఈవో కొమ్ముల సుబ్బారావు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది వైఫల్యాలను అధిగమించి చందనోత్సవం విజయవంతానికి కృషి ... మిగతా 6వ పేజీలో

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు

- ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు కేటాయింపు
- ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న పిల్లలకు అవకాశం
- మే 2 నుంచి దరఖాస్తుల స్వీకారం

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం 12 (1)సి ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికిగాను ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సమగ్రశిక్షా అభియాన్ అడిషనల్ ప్రోజెక్టు కో-ఆర్డినేటర్ చంద్రశేఖరరావు తెలిపారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న పిల్లలు (అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓపెన్ కేటగిరీ) ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు మే నెల రెండు నుంచి తొమ్మిదో తేదీ వరకు దరఖాస్తులను 'సీఎస్ఈ.ఏపీ.జీవీవో. ఇన్' వెబ్‌సైట్ లేదా సమీపంలోని గ్రామ/వార్డు సచివాలయాలు, మండల విద్యాశాఖాధికారికి స్వయంగా అందజేయాలని ఆయన సూచించారు. విద్యా హక్కు చట్టం కింద ప్రతి ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు ఆ వర్గాలకు కేటాయించాలన్నారు. ఐబీ/సీఎస్ఈ/ ... మిగతా 6వ పేజీలో

భర్త పింఛన్ భార్యకు...

- జిల్లాలో 1,559 మందికి 'స్పౌజ్' పింఛన్లు మంజూరు
- వచ్చే నెల తొలి వారంలో పంపిణీ

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్లు తీసుకుంటూ చనిపోయిన వ్యక్తి స్థానంలో అతని భార్యకు వచ్చే నెల తొలివారంలో పింఛన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. 2023 డిసెంబరు నుంచి 2024 అక్టోబరు మధ్య చనిపోయిన వారికి సంబంధించి ఇప్పుడు పింఛన్లు ఇవ్వనున్నారు. ఈ నెలాఖరులోగా దరఖాస్తులు సమర్పించాలని సచివాలయ సిబ్బంది తమ పరిధిలో ఉన్నవారికి సమాచారం ఇచ్చారు. జిల్లాలో 2023 డిసెంబరు నుంచి 2024 అక్టోబరు వరకు 1,559 మంది చనిపోగా వారి పింఛన్లు భార్యకు మంజూరు చేయనున్నట్టు అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రానికి 1,000 మందికిపైగా దరఖాస్తు చేశారు. వీరి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నారు. వీరందరికీ మేనెల మొదటి వారంలో పింఛన్లు పంపిణీచేస్తారు.

మే ఒకటిన సామాజిక పింఛన్లు పంపిణీ

జిల్లాలో సామాజిక పింఛన్లు మే నెల ఒకటో తేదీ...గురువారం పంపిణీ చేస్తారు. మొత్తం 1,59,581మందికి రూ.69.64 కోట్లు విడుదలైంది. నాలుగు గ్రామీణ మండలాల్లో 26,404 మందికి రూ.11.09 కోట్లు, జీవీఎంసీ పరిధిలోని ఏడు జోన్ల (అనకాపల్లి జోన్‌లో అనకాపల్లి జిల్లా అధికారులు పంపిణీ చేస్తారు)లో 1,33,177 మందికి రూ.58.54 కోట్లు పంపిణీ చేయనున్నారు.

అడుగడుగునా అప్పన్న నిజరూపాలు

- భక్తుల దర్శనానికి వీలుగా నాటి ఆలయ అనువంశిక ధర్మకర్త ఆనందగజపతిరాజు హయాంలో ఏర్పాటు
- తిలకించి, పులకిస్తున్న భక్తజనం

సింహాచలం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై, కొండ దిగువన పలుచోట్ల ఏర్పాటు చేసిన అప్పన్నస్వామి నిజరూపాలను తిలకిస్తున్న భక్తులు ఆనందంతో పులకిస్తున్నారు. పురూరవ చక్రవర్తి కాలం నుంచి వరాహలక్ష్మీనృసింహ స్వామి ఏడాది పొడవునా పన్నెండు మణుగుల శ్రీచందనపు ముద్దలో ఉండి వైశాఖమాస శుక్ల పక్ష తృతీయ నాడు నిజరూపంలో దర్శనమివ్వడం కొన్ని శతాబ్దాలుగా వస్తున్న ఆచారం. స్వామివారి నిజరూపాన్ని దర్శించుకోవాలంటే భక్తులు ఎన్నో ఇబ్బందులను చవిచూడాల్సి వస్తుంది. దివ్యాంగులు, వయో వృద్ధుల పరిస్థితి మరీ దారుణం.ఈవిషయాన్ని గుర్తించిన ఆలయ అనువంశిక ధర్మకర్త 1887లో ఆలయ అమీనా (ప్రస్తుతం పర్యవేక్షణాధికారి)గా పని చేసిన మాగిన సోమయ్య సారధ్యంలో కొన్నిచోట్ల స్వామివారి నిజరూపాన్ని భక్తులు దర్శించుకునేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. ప్రధానంగా భైరవపురం గేటు (తొలిపావంచా) వద్ద ఉన్న నిజరూపానికి భక్తులు పూజలు చేసి మెట్ల మార్గంలో ప్రయాణించడం నేటికీ ఆనవాయితీగా వస్తోంది. తొలిపావంచాకు అతి సమీపంలో తూర్పు కుడ్యానికి (గోడకు)నల్ల రాతిపై స్వామివారి నిజరూప


పుష్కరిణి గట్టుపై ఉన్న స్వామివారి నిజరూపం

విగ్రహంతో పాటు మాగిన సోమయ్య రాయించిన శాసనం ఉంది.ఆ శాసనంలో చందనయాత్ర రోజున సింహగిరికి చేరుకుని నిజరూపాన్ని దర్శించుకోలేక బాధపడే భక్తులకు సంతృప్తిని చేందుకు అక్కడ అదే రూపాన్ని ఏర్పాటు చేసి


తొలిపావంచ వద్ద ఉన్న నిజరూప విగ్రహం

నట్టు పేర్కొన్నారు. అలాగే అడివివరంలో ఉత్తర దిక్కున ఉన్న వరాహ పుష్కరిణి గట్టుపై కూడా రెండుచోట్ల ఇదే తరహాలో అప్పన్న నిజరూపం భక్తులకు కనిపిస్తుంది.సింహాద్రినాథుడి సన్నిధికి చేరువగా ఈశాన్య దిక్కులో ఉన్న పురాతన రాతి రథంపై కూడా స్వామి నిజరూప విగ్రహాన్ని దర్శించుకోవచ్చు.


నాగార్జునను మొక్క ఇచ్చి అభినందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కిమిడి నాగార్జునకు గంటా అభినందనలు

భీమునిపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : విజయనగరం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన కిమిడి నాగార్జునను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభినందించారు. ఆదివారం రాత్రి ఆయన ఎంవీపీ కాలనీలో నాగార్జునను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడేవారిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గుర్తిస్తారని చెప్పారు. అనంతరం నాగార్జునకు పూల మొక్క అందించి, శాలువ కప్పి సన్మానించారు.

నృత్య కళాకారిణి అపర్ణకు నారీశక్తి పురస్కారం

మధురవాడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పిలకవానిపాలెంకు చెందిన కూచిపూడి నృత్య కళాకారిణి ఎస్ఎస్‌వీ అపర్ణకు న్యూఢిల్లీకి చెందిన దూస్రాదశక్ ఫౌండేషన్ నారీశక్తి పురస్కారం అందించింది. ఈమేరకు ఆదివారం రాత్రి న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రముఖ సినీ నటి మయూరి సుధా చంద్రన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అపర్ణ ఇప్పటికే పలు రాష్ట్రాల్లో 500కు పైగా కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చి పలు అవార్డులు సొంతం చేసుకున్నారు.ఇటీవల బెంగళూరులో సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్ అవార్డు పొందారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా ఆమె పేరు ఉంది.


సినీ నటి సుధాచంద్రన్‌తో అపర్ణ

'అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి'

కొమ్మాది, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఆరో వార్డులో సచివాలయ సిబ్బందిని సమూలంగా మార్చాలని, లేకపోతే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్, ఆరో వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వార్డులో ఆరు నెలలుగా ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, డ్రైనేజీలు శుభ్రపరచడానికి వీల్లేకుండా కొంతమంది రోడ్లపై బడ్డీలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కొమ్మాది, సౌండ్ అండ్ సౌండ్ లేఅవుట్, సాయి ప్రియా లేఅవుట్ ప్రాంతాల్లో ఆక్రమణలకు సంబంధించి పత్రికల్లో కథనాలు వస్తున్నా.. సచివాలయం సిబ్బంది పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు ఆయన తెలిపారు.

పగటి పూట విద్యుత్ వెలుగులు

సాగర్‌నగర్,ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వేలి రహదారిలో వీధి లైట్లు పట్ట పగలు కూడా వెలుగుతున్నాయి. కొన్ని రోజులుగా ఇక్కడ ఈ పరిస్థితి ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. చాలా రోజుల పాటు ఇక్కడ వీధి లైట్లు వెలగలేదు. స్థానికుల ఫిర్యాదుల మేరకు జీవీఎంసీ సిబ్బంది ఇటీవల కొన్ని లైట్లకు మరమ్మతు చేయగా, మరి కొన్నిచోట్ల హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేశారు. నిర్వహణ లోపం వల్ల అవి 24 గంటలూ వెలుగులు విరజిమ్ముతున్నాయి. అధికారులు తక్షణమే ఈ సమస్యపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

టెన్త్ పరీక్షల్లో ప్రతిభావంతులకు బహుమతులు ప్రదానం నేడు

భీమునిపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో మండల, జోన్ స్థాయిలో అధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం నగదు బహుమతులు అందజేయనున్నట్టు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీచ్‌రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగే అభినందన సభలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ. 10 వేలు, రూ. 5 వేలు, రూ. 3 వేలు చొప్పున నగదు బహుమతులు అందిస్తామన్నారు. శ్రీమతి గంటా నారాయణమ్మ మెమోరియల్ ట్రస్టు తరఫున ఈ ప్రోత్సాహకాలను అందిస్తున్నామని ఆయన చెప్పారు. అనంతరం టీడీపీ గ్రామ, వార్డు, మండల నూతన కమిటీల నియామకంపై సమావేశం జరుగుతుందన్నారు.

ది సన్ స్కూల్లో...

పదో తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ది సన్ స్కూల్ యాజమాన్యం సోమవారం నగదు బహుమతులు అందజేసింది. ఆ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాసరావు చేతుల మీదుగా వీటిని అందించారు. 596 మార్కులు సాధించిన మానసకు రూ. 50 వేలు, 590 నుంచి 594 మధ్య మార్కులు సాధించిన 9 మందికి రూ. 20 వేలు చొప్పున, 585 నుంచి 593 మధ్య మార్కులు పొందిన 16 మందికి రూ. 10 వేలు చొప్పున ఇచ్చారు. అలాగే విద్యార్థులకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులకు రూ. 1.16 లక్షలు ప్రత్యేక బహుమతిగా అందించారు.

పీజీఆర్ఎస్‌కు ఒకే ఒక్క వినతి

భీమునిపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఒకే ఒక్క వినతి అందింది. జడ్సీ ప్రసన్న వాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తగరపువలస నుంచి పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఒక అర్జీ అందించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సూపరింటెండెంట్ ఎస్. శ్రీనివాసరావు, పలు విభాగాధిపతులు పాల్గొన్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

తగరపువలస, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవ తీసుకుని అఖిల పక్షం సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ కార్మిక సంఘం సమావేశం కోరింది. సోమవారం వారు చిట్టివలసలో ఉన్న ఆ సంఘం కార్యాలయంలో సమావేశ మయ్యారు. సమావేశంలో ఆ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పలరెడ్డి, కార్యదర్శి ఆదినారాయణ, కూర్మారావు, రామారావు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు

... 5వ పేజీ తరువాయి

ఐసీఎస్ఈలో ప్రవేశాలు పొందేందుకు మార్చి 31 నాటికి ఐదేళ్లు, రాష్ట్ర సిలబస్‌లో ప్రవేశాలకు మే 31 నాటికి ఐదేళ్లు పూర్తయిన బాలబాలికలు ఒకటో తరగతిలో ప్రవేశాలకు అర్హులన్నారు. దీనికి అనుగుణంగా జిల్లాలో 621 ప్రైవేటు పాఠశాలలు విద్యాహక్కు చట్టం 12(1)సీ కింద నమోదైనట్టు వెల్లడించారు. కాగా ప్రవేశాలకు సంబంధించి సోమవారం ఆయన మండల విద్యాశాఖాధికారులు, కార్యాలయ సిబ్బందితో సమీక్షించారు.

నగర అభివృద్ధికి నా శక్తిమేరకు కృషి

... 5వ పేజీ తరువాయి

పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. వైసీపీ నాలుగేళ్ల పాలనలో నగరాన్ని అధోగతి పాల్జేశారని, వీధి లైట్లు వెలిగించుకోలేని దుస్థితికి జీవీఎంసీని నెట్టేశారని పీలా విమర్శించారు. మేయర్‌గా తనకు తక్కువ కాల వ్యవధే ఉన్నప్పటికీ...ఉన్నంతలో బాగా చేశానని ప్రజలు అనుకునేలా నగరాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ప్రతి వార్డులోనూ వీధి లైట్లు వెలిగేలా చేయడంతోపాటు పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తానన్నారు. వేసవిలో తాగునీరు సక్రమంగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఒక కార్యాచరణ రూపొందించుకుని దానిప్రకారం అధికారులతో కలిసి నగర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానన్నారు. వైసీపీ నాలుగేళ్ల పాలనలో చాలా లోపాలు ఉన్నాయని, వాటిపై సమీక్షించిన తర్వాత చట్ట ప్రకారం అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు, జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, తదితరులు పాల్గొన్నారు.


మిథిలాపురి వుడాకాలనీ ప్రధాన రహదారిలో బోసిపోయిన డివైడర్, ఐటీ హిల్ రోడ్డులో దుస్థితి

గ్రీన్ బెల్టులో పచ్చదనం కనుమరుగు

మధురవాడ,ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని గ్రీన్ బెల్టులో పచ్చదనం కనుమరుగైంది. గతంలో ఇక్కడ మొక్కలు వేసినప్పటికీ వాటి సంరక్షణకు జీవీఎంసీ ఉద్యానవన శాఖాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పూర్తిగా ఎండిపోయాయి. జాతీయ రహదారి నుంచి సుమారు రెండు కిలోమీటర్లు పొడవున్న మిథిలాపురి 100 అడుగుల రోడ్డులో పచ్చదనం కోసం జీవీఎంసీ అధికారులు డివైడర్‌ను గ్రీన్‌బెల్టుకు కేటాయించారు. ఈ కాలనీలో అక్కడక్కడ మాత్రమే మొక్కలు ఉన్నాయి. గాంధీ విగ్రహం నుంచి కాలనీ ఆఖరి వరకు మొక్కలు లేవు. ఈ రోడ్డుకు కొనసాగింపుగా ఉన్న ఐటీ హిల్ రహదారి కూడా వంద అడుగుల వెడల్పున ఉంది. ఇక్కడ కూడా గ్రీన్‌బెల్టు కోసం డివైడర్‌ను కేటాయించారు. కానీ రోడ్డు పొడవునా ఎక్కడా మొక్కలు లేవు.నగరంలో మిగిలిన చోట్ల గ్రీన్‌బెల్టులు పచ్చదనంతో కళకళలాడుతుంటే మధురవాడలో మాత్రం నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రీన్ బెల్టులో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు

విశాలాక్షినగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా కృషి చేస్తానని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంబంధిత అధికారులతో చర్చలు జరుపుతున్నానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల సంఘం (ఏపీయూఎస్) ఆధ్వర్యంలో విశాలాక్షినగర్‌లోని బీవీకే కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పాఠాలు బోధించడం, ఉపాధ్యాయుల హక్కుల సాధనతో పాటు భారతీయుత, హిందూ భావజాలాన్ని పెంపొందించడం కోసం ఏపీయూఎస్ పని చేస్తుండడంతో అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో పలు జిల్లాలకు చెందిన ఏపీయూఎస్ నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు

ఘనంగా బాల వికాస కేంద్రాల వార్షికోత్సవం

ఆనందపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల వికాస కేంద్రాల వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ ఉత్తరాంధ్ర విభాగ్ కన్వీనర్ గరిమెళ్ళ రాధాకృష్ణ మాట్లాడుతూ చిన్నారుల్లో జాతీయభావాన్ని పెంపొందించడంతో పాటు దేశ సంస్కృతీ సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించడానికి తాము కృషి చేస్తున్నామని చెప్పారు. విశాఖ జిల్లా కన్వీనర్ నరేంద్ర చౌదరి మాట్లాడుతూ టీటీడీ ట్రస్టు ఆర్థిక సహాయంతో నియోజకవర్గంలో భీమన్నదొరపాలెం, ఇచ్చాపురం, టి. నగరపాలెం, మూలకుద్దు గ్రామాల్లో ఆలయాలు నిర్మించామని, ఆయా ఆలయాల కేంద్రంగా చిన్నారులతో బాల వికాస కేంద్రాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

తహసీల్దార్‌కు రైతుల వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటితూరు గ్రామానికి చెందిన రైతులు తమకు సాగు హక్కు కల్పించాలని కోరుతూ తహసీల్దార్ రామారావుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా భూములను సాగు చేస్తున్నా.. సాగుహక్కు కల్పించడం లేదన్నారు. భూముల ఆన్‌లైన్‌కు కూడా ఎన్నో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగనబంద ఓ క్రిడ్డి పాఠశాలలో అక్రమంగా ప్రవేశించి వస్తువులు, నగదు చోరీ చేసిన ఎర్రింటి కృష్ణబాబుకు భీమిలి మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ డి. సౌజన్య ఏడాది జైలు శిక్ష విధించారు. కృష్ణబాబు పాఠశాలలోకి అక్రమంగా ప్రవేశించి ప్రిన్సిపాల్ హ్యాండ్ బ్యాగులో రూ. 7 వేలు నగదు చోరీ చేశారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. సోమవారం కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ పైవిధంగా శిక్ష విధించారు. నిందితుడు విజయనగరం జిల్లా డెంకాడలోని గొండయ్యపాలెం గ్రామానికి చెందినవాడని పోలీసులు తెలిపారు.

'తెలుగు వెలుగు' పురస్కారానికి కొయ్య వెంకటరమణారెడ్డి ఎంపిక

అగనంపూడి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అగనంపూడికి చెందిన కొయ్య వెంకటరమణారెడ్డి తెలుగు వెలుగు ఉగాది మహా నంది జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మే 1న నగరంలో జరగనున్న పురస్కార మహోత్సవంలో ఈ అవార్డును ఆయనకు నిర్వాహకులు అందించనున్నారు. సామాజిక సేవా రంగంలో రమణారెడ్డి చేస్తున్న సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగుల పెన్షన్లు రీ అసెస్‌మెంట్

... 5వ పేజీ తరువాయి

జిల్లాలకు పంపింది. ఈ జాబితాలో కంటిచూపుతో బాధపడుతున్నవారు 2,372 మంది ఉండగా, 2,284 మంది అసెస్‌మెంట్ ప్రక్రియను అధికారులు పూర్తిచేశారు. మరో 88 మందిని చూడాల్సి ఉంది. అలాగే, మానసిక సమస్యలతో బాధపడుతూ పెన్షన్ పొందుతున్నవారు 4,391 మంది ఉండగా, వీరిలో 4,125 మంది (93.94 శాతం)ని తనిఖీ చేశారు. మరో 266 మందిని పరీక్షించాల్సి ఉంది. ఎముకల సంబంధిత సమస్యల వల్ల వైకల్యానికి గురై పెన్షన్ పొందుతున్నవారు 11,481 ఉండగా ఇప్పటివరకూ 3,487 మంది (30.37 శాతం)కి రీ అసెస్‌మెంట్ ప్రక్రియను అధికారులు పూర్తిచేశారు. మరో 7,994 మందికి పరీక్షించాల్సి ఉంది. అలాగే, వినికిడి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు 2,289 మంది ఉండగా, ఇప్పటివరకూ 549 మంది (23.98 శాతం)కి అసెస్‌మెంట్ ప్రక్రియను పూర్తిచేశారు. మరో 1,740 మందిని పరీక్షించాల్సి ఉంది. పలు రకాల వైకల్యాలతో బాధపడుతున్న 773 మంది అసెస్‌మెంట్ ప్రక్రియను ఇంకా ప్రారంభించలేదు. మొత్తం జిల్లాలో రీ అసెస్‌మెంట్ చేయవలసిన పెన్షనర్లు 21,306 మంది ఉండగా ఇప్పటివరకూ 10,445 మంది (49.02 శాతం)కి తనిఖీ ప్రక్రియ పూర్తయింది. మరో 10,861 మందిని తనిఖీ చేయాల్సి ఉంది.

రీ అసెస్‌మెంట్‌ను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం

పెన్షనర్ల రీ అసెస్‌మెంట్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకూ 49 శాతం మేర పూర్తయింది. మిగిలిన వారికి స్లాట్లు కేటాయించారు. రీ వెరిఫికేషన్‌కు గడువు ఏమీ లేదు. అనర్హులు ఎవరూ పెన్షన్లు పొందకూడదు. అర్హులు ఎవరూ నష్టపోకూడదన్నది ప్రభుత్వ ఉద్దేశం. అందుకు అనుగుణంగా అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా ప్రక్రియను చేపడుతున్నాం.

- పిడుగు శంకర ప్రసాద్, డీసీహెచ్ఎస్

వ్యర్థాలతో గోస్తనీ నది కలుషితం

పద్మనాభం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోస్తనీ నది జలాలు వ్యర్థాలతో కలుషితమవుతున్నాయి. నదీ గర్భంలో వ్యర్థాలను విడిచిపెట్టడం, ప్లాస్టిక్ కవర్లు తదితర వాటిని వేస్తుండడంతో నది కలుషితం కావడంతో పాటు నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. పద్మనాభంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ఇక్కడి వంతెనపై నుంచి వ్యర్థాలను విచ్చలవిడిగా పడేస్తున్నారు. కొన్ని రకాల మెడికల్ వ్యర్థాలను కూడా పారబోస్తున్నారు. వీటికితోడు పరిసర గ్రామాల ప్రజలు నదిలో దుస్తులు ఉతుకుతున్నారు. దీనివల్ల నదిలో ఉన్న మంచినీటి పథకాలు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.


పద్మనాభంలో కలుషితమైన నది జలాలు

అంగన్‌వాడీ కేంద్రాలు పరిశీలన

పద్మనాభం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సుపోషిత్ పంచాయతీలుగా ఎంపికైన కృష్ణాపురం, రేవిడి, రౌతులపాలెం, మద్దిలోని అంగన్‌వాడీ కేంద్రాలను నాగాలాండ్ మహిళా శిశు సంక్షేమ శాఖ బృందం సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా వారు గర్భిణిలు, బాలింతలు, చిన్న పిల్లలకు అమలు చేస్తున్న పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాగాలాండ్ సీడీపీఓ ఆర్. చిరోత్సున్యాసో, సూపర్‌వైజరు లోచుంబెని, భీమిలి ఐసీడీఎస్ పీఓ శ్రీదేవి, సూపర్‌వైజర్లు అనిత, సరిత, రాజ్యలక్ష్మి, పీడీ కార్యాలయం డీసీ శ్రీనివాసరావు, సర్పంచ్ లక్ష్మి భవానీ, తదితరులు పాల్గొన్నారు.


మద్ది అంగన్‌వాడీ కేంద్రంలో నాగాలాండ్ బృందం

డీసీసీబీ చైర్మన్‌గా కోన తాతారావు

... 5వ పేజీ తరువాయి

చైర్మన్‌గా నియమితులైన కోలా గురువులు గత ఏడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి జాయింట్ కలెక్టర్ పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో కూటమి ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని భావించింది. అయితే అది కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో సోమవారం నామినేటెడ్ పద్ధతిలో చైర్మన్లను నియమించింది. చైర్మన్‌గా కోన తాతారావు నియామకంపై రెండు, మూడు రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఆయనతోపాటు డీసీసీబీ బోర్డులో మరో ఆరుగురిని ప్రభుత్వం నియమించనున్నది. ఇదిలావుండగా ఈనెల ఎనిమిదో తేదీన కోన తాతారావు పరవాడ మండలం లంకెలపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యత్వం తీసుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 30కుపైగా బ్రాంచీలు, 98 సహకార సంఘాలు కలిగిన డీసీసీబీ రాష్ట్రంలో అత్యధిక వ్యాపార లావాదేవీలు జరిపే ఐదింటిలో ఒకటిగా ఉంది.

ఉక్కు ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి...

పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన కోన తాతారావు న్యాయశాస్త్రంలో పట్టభద్రులు. నిర్వాసితుడు కోటాలో విశాఖ ఉక్కు కర్మాగారంలో ఉద్యోగిగా చేరి మేనేజర్ హోదా వరకూ పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. అనంతరం రాజకీయ ప్రవేశం చేశారు. తొలుత పెదగంట్యాడ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన తాతారావు ఉమ్మడి రాష్ట్రంలో 1993లో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, తరువాత చైర్మన్‌గా సేవలు అందించారు. 2004లో కాంగ్రెస్ పార్టీని వదిలి తెలుగుదేశంలో చేరిన తాతారావు 2007లో కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. జీవీఎంసీలో టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌గా, 2009లో అర్బన్ జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2018లో టీడీపీని వీడి జనసేనలో చేరిన తాతారావు ప్రస్తుతం ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా ఉన్నారు.

మేయర్ పీఠంపై పీలా

... 5వ పేజీ తరువాయి

బల్లలు చరిచి హర్షం వ్యక్తంచేశారు. మేయర్‌గా ఎన్నికైనట్టు పీలా శ్రీనివాసరావుకు జాయింట్ కలెక్టర్ ధ్రువీకరణ పత్రం అందజేసి, ఆయన చేత ప్రమాణం చేయించి సమావేశం ముగిసినట్టు ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణశ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, గణబాబు, పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్‌బాబు, కొణతాల రామకృష్ణ, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కూటమి కార్పొరేటర్లు, జీవీఎంసీ అధికారులు, కూటమి నేతలతో పాటు అభిమానులు నూతన మేయర్ పీలా శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

మేయర్‌గా పీలా ఎన్నికతో జీవీఎంసీ కార్యాలయం బయట టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఆయన అభిమానులు క్రేన్‌పై భారీ గజమాలను తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ నిస్వార్థంగా పనిచేస్తానన్నారు. సీఎం చంద్రబాబునాయుడు చెప్పినట్టు విలువలతోపాటు పార్టీ, ప్రభుత్వ విధానాలకు లోబడి పనిచేస్తానన్నారు. తనకు మేయర్‌గా అవకాశం కల్పించిన కార్పొరేటర్లు, కూటమి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత నాలుగేళ్లలో వైసీపీ నేతలు జీవీఎంసీలో చేసిన అవినీతి కారణంగానే అవిశ్వాస తీర్మానం పెట్టాల్సి వచ్చిందన్నారు. వైసీపీ నేతలు ఆరోపించినట్టు తాము కార్పొరేటర్లను ప్రలోభాలకు గురిచేయలేదని, బెదిరించలేదని అన్నారు. వైసీపీ నేతలు చేస్తున్న అక్రమాలను భరించలేక స్వచ్ఛందంగా మేయర్‌ను దింపేందుకు తమతో కలిసి వచ్చారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన, నగర అభివృద్ధికి అందరం ఐక్యంగా పనిచేస్తామన్నారు. కార్పొరేషన్ చరిత్రలో టీడీపీ నుంచి 1987లో మొదటి సారి డీవీ సుబ్బారావు ఎన్నికవ్వగా, రెండో వ్యక్తి పీలా శ్రీనివాసరావు కావడం విశేషం.

టికెట్లు... ఇక్కట్లు

... 5వ పేజీ తరువాయి

జిల్లాల ప్రజా ప్రతినిధులే కుండా ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి నాయకులు వస్తుండడం వల్ల ఆ టికెట్లకు డిమాండ్ ఏర్పడింది. సోమవారం రాత్రి వరకు వీటిని ఎవరికీ జారీ చేయలేదు. ఒకరోజు ముందుగా అంటే మంగళవారం ప్రజా ప్రతినిధులకు, వీవీఐపీలకు, ప్రొటోకాల్ వ్యక్తులకు ఇవ్వనున్నారు. ఇవే టికెట్లను ఆశిస్తూ నగరంలో ప్రముఖులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకున్నారు. వారికి కూడా సోమవారం వరకూ ఎటువంటి సమాచారం రాలేదు. ఈ టిక్కెట్ ఉంటే అంతరాలయ దర్శనం జరుగుతుందంటున్నారు. అందుకని వాటికి డిమాండ్ పెరిగింది. ఎవరికి ఇస్తారో, ఎన్ని ఇస్తారో వేచి చూడాల్సి ఉంది.

దొరకని రూ.వేయి టిక్కెట్లు

అన్నీ సక్రమంగా ఉంటే వేయి రూపాయల టికెట్‌తో గంట నుంచి రెండు గంటల వ్యవధిలో దర్శనం చేసుకోవచ్చు. అందుకని వీటి కోసం చాలామంది ప్రయత్నించారు. అయితే ఈ టికెట్లు అయిపోయాయని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు. ప్రతి ఏడాది దేవస్థానం ఏఈఓలు ఈ టికెట్లను బ్లాక్ చేయించి, వారికి అవసరమైన వారికి అమ్ముకుంటున్నారు. ఈసారి కూడా అదే జరిగింది. ఈ టికెట్లు ఎన్ని ముద్రించారో అధికారులు వెల్లడించలేదు. అప్పుడే ఎలా అయిపోయాయో ఎవరికీ అర్థం కావడం లేదు. దీనిపై ఏ అధికారీ స్పందించడం లేదు.

అందుబాటులో రూ.300 టికెట్లు...

టికెట్ తీసుకొని త్వరగా దర్శించుకొని వెళదామనుకునే భక్తులకు ప్రస్తుతం రూ.300 టికెట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అవి కూడా మధ్యాహ్నం తరువాత దర్శనానికి సంబంధించినవి ఉన్నాయని, ఉదయం దర్శనానివి లేవని సిబ్బంది చెబుతున్నారు. ఇవన్నీ చూస్తుంటే ఎప్పటిలాగే దేవస్థానం సిబ్బంది చక్రం తిప్పారని అర్థమవుతోంది.

చందనోత్సవానికి సర్వం సిద్ధం

... 5వ పేజీ తరువాయి

చేస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాది రూ.1500, రూ.1000, రూ.300 టికెట్లు విక్రయించామన్నారు. ప్రవేశ ద్వారం వద్ద, లోపల పంచింగ్, స్కానింగ్ చేయడం ద్వారా రీసేల్‌ను నిరోధించనున్నట్టు చెప్పారు. ఉచిత దర్శనాలు తెల్లవారుజామున నాలుగు గంటలకు ప్రారంభమవుతాయన్నారు. సింహగిరిపై పార్కింగ్ స్థలం చాలా తక్కువగా ఉన్నందున, కొండదిగువనే అధిక ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటుచేశామన్నారు. భక్తులందరూ తప్పనిసరిగా సొంత వాహనాలను కొండ దిగువనే వదిలి దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత రవాణా సదుపాయాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఉచిత ప్రయాణానికి 45 ఆర్టీసీ బస్సులు, 40 మినీ బస్సులు, 15 ఇన్నోవాలను దేవస్థానం అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఉచితం, రూ.300, రూ.1000 క్యూలలోని భక్తులను తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి దర్శనాలకు అనుమతిస్తామన్నారు. ప్రధానమైన అంతరాలయ దర్శనాలను బుధవారం ఉదయం ఆరు గంటల తరువాత పూర్తిగా నిలిపివేస్తున్నట్టు ఈవో పేర్కొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతు

ఆరిలోవ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ సిబ్బంది సోమవారం బీఆర్‌టీఎస్ రోడ్డులో వీధి దీపాల మరమ్మతు చేపట్టారు. గత కొన్ని నెలలుగా ఈ ప్రాంతంలో వీధి దీపాలు వెలగక వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

ఆరిలోవలో దోమల బెడద

ఆరిలోవ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆరిలోవ ప్రాంతంలో దోమల బెడదతో ప్రజలు సతమతమవుతున్నారు. ప్రజారోగ్య సిబ్బంది కొంతకాలంగా పొగ కొట్టకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. నిద్రకు దూరమైన ప్రజలు దోమల నిర్మూలనకు కాయిల్స్, లిక్విడ్ వంటివి వాడుతున్నారు. ఇవి అనారోగ్యానికి దారితీస్తాయని కొందరు భయపడుతున్నారు. అయినా దోమల బెడద నుంచి కొంతైనా ఉపశమనం కలుగుతుందన్న ఆశతో నివారణ ప్రయత్నాలు చేస్తున్నారు. జీవీఎంసీ సిబ్బంది దీనిపై దృష్టి పెట్టడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పెదగదిలి సాలిపేట, కొండవాలు ప్రాంతంలో చెట్లు అధికంగా ఉండటంతో దోమలు పెరిగిపోతున్నాయని, జీవీఎంసీ యంత్రాంగం తరచూ పర్యవేక్షించి తమను ఈ ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

'లెక్కలపై భయాన్ని తొలగించాలి'

ఆరిలోవ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు లెక్కలపై ఉన్న భయాన్ని ఉపాధ్యాయులు తొలగించాలని నిపుణులు సూచించారు. శ్రీకృష్ణాపురంలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులకు లెక్కలపై సోమవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా బెంగళూరుకు చెందిన అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్శిటీ అధ్యాపకులు అనుపమ, రత్నకృష్ణ, కరుణాకర్ మాట్లాడుతూ పరీక్షల్లో విద్యార్థులకు ఎక్కువ స్కోరింగ్ పద్ధతిలో లెక్కలేనని చెప్పారు. ఈ శిక్షణకు ఉత్తరాంధ్ర జిల్లాల్లోని 25 పాఠశాలల నుంచి 45 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శిక్షణ బుధవారంతో ముగుస్తుందని గురుకులం ప్రిన్సిపాల్ రత్న వల్లి తెలిపారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత



ఆరిలోవ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని విశాఖ చైల్డ్ లైన్ కో-ఆర్డినేటర్ డేవిడ్ రాజు అన్నారు. సోమవారం ఆయన పెదగదిలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 18 ఏళ్లలోపు బాలికలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అక్షయ తృతీయ సందర్భంగా పలు ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. వాటిని నిర్మూలించేందుకు ఆలయాలు, ప్రార్థనా మందిరాల వద్ద నిఘా వేయాలన్నారు. బాల్య వివాహాలపై పాస్టర్లు, పురోహితులు, మసీదు పెద్దలకు అవగాహన కల్పించామన్నారు. చిన్న వయస్సులో పెళ్లి చేయడం వల్ల భవిష్యత్తు కోల్పోతారన్నారు.

సినిమా గైడ్

- **సారంగపాణి జాతకం :** శారద, శ్రీరామ, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య(గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అరుణ(పెదగంట్యాడ), తాతా (తగరపు వలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక) **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 15, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 22, పచ్చిమిర్చి 20, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 14, క్యారెట్ 36 దొండకాయలు 18, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది)48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 52, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి)100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, కీరదోస 24, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 40 చిలగడదుంపలు 34, కంద 80, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, క్రరపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

కుట్టు శిక్షణకు దరఖాస్తుల వెల్లువ

స్వయం ఉపాధికి మహిళల ఆసక్తి

బీసీ కార్పొరేషన్‌కు దరఖాస్తులు



డీఆర్‌డీఏ కార్యాలయ భవనం

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమ ఆర్థిక పరిస్థితి మెరుగుపరుచుకునేందుకు స్వయం ఉపాధి పథకాలపై ఆసక్తి చూపుతున్నారు. కుట్టు శిక్షణ కోసం బీసీ కార్పొరేషన్‌కు దరఖాస్తులు వెల్లువెత్తాయి. శిక్షణ ద్వారా స్వయం ఉపాధి ఏర్పాటుచేసుకోవడం, తద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలనే ఆసక్తి వారిలో కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో కార్పొరేషన్లు పేరుకే తప్ప, ఆయా సామాజిక వర్గాలకు ఒరిగిందేమీ లేదు. కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయా కార్పొరేషన్లకు జవసత్వాలు వచ్చాయి. తాజాగా బీసీ కార్పొరేషన్‌కు 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాయితీ బ్యాంకు రుణాలను అందించేందుకు ప్రవేశపెట్టిన స్వయం ఉపాధి పథకానికి దరఖాస్తులు భారీగా వచ్చాయి. దరఖాస్తులు పరిశీలించి, అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. మహిళలు స్వయం ఉపాధి ఏర్పాటుకు వీలుగా కుట్టుశిక్షణ ఇవ్వడానికి కూడా దరఖాస్తులు ఆహ్వానించగా, విశాఖ జిల్లాలో 3,596 మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించగా, 19,478 దరఖాస్తులు రావడం గమనార్హం. దీనిని బట్టి కుట్టు శిక్షణకు మహిళల్లో చాలా ఆసక్తి ఉన్నట్లు స్పష్టమయ్యింది. బీసీ, ఈబీసీ కార్పొరేషన్లకు స్వయం ఉపాధి రుణాలు ఇవ్వడానికి విశాఖ జిల్లాకు 2,368 యూనిట్లు కేటాయించగా 18,984 దరఖాస్తులు వచ్చాయి.

కుట్టు శిక్షణకే మొగ్గు

మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులు ఆహ్వానించగా భారీగా స్పందన రావడంతో అర్హుల ఎంపిక కత్తిమీద సాములా మారింది. జిల్లాకు 3,596 యూనిట్లు కేటాయించగా 19,478 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇందులో 15,882 దరఖాస్తులను తిరస్కరించాల్సి ఉంటుంది. చాలా మంది మహిళలు గృహిణులుగా ఇంట్లోనే ఉండిపోతున్నారు. పిల్లల సంరక్షణ బాధ్యతల కారణంగా బయటకు వెళ్లి ఉద్యోగం చేసే పరిస్థితులు చాలా మందికి అనుకూలంగా లేవు. దీంతో ఇంట్లోనే ఓ కుట్టు మిషన్ ఏర్పాటుచేసుకోవడం ద్వారా ఉపాధి పొందాలనే ఆలోచన చాలా మందిలో ఉంది. ముఖ్యంగా ఈ రంగంలో ఫ్యాషన్ డిజైనింగ్, సాంకేతికత చొచ్చుకు రావడంతో ఆయా సందర్భాలను బట్టి బ్లౌజ్ కుట్టడానికే రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకూ తీసుకుంటున్నారు. ప్రాథమిక స్థాయిలో కుట్టు శిక్షణ నేర్చుకుంటే భవిష్యత్‌లో ఈ రంగంలోనే ఎంబ్రాయిడరీ వంటి వాటిలో శిక్షణతో ముందుకు వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇంట్లో ఉంటూనే ఎంతో కొంత సంపాదించుకునే వెసులుబాటు లభిస్తోంది. దీంతో ఈ రంగంలోకి రావడానికి మహిళలు ఆసక్తిగా ఉన్నారు.

హిడెన్ స్ప్రౌట్స్ సంస్థకు ప్రభుత్వ సహకారం అవసరం

ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు



హరిబాబు దంపతుల నుంచి చెక్కు అందుకుంటున్న కండిపల్లి శ్రీనివాసరావు

పెదవాల్తేరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పెదవాల్తేరులో నిర్వహిస్తున్న హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలను గత ప్రభుత్వం మూసి వేయడం బాధాకరమని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు వ్యాఖ్యానించారు. ఇటీవల తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కృషితో మానసిక దివ్యాంగుల పాఠశాలను ఇప్పించడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. సోమవారం ఆయన అవేకనింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. మూడేళ్లుగా చాలా కష్టాలు అనుభవించిన మానసిక దివ్యాంగ విద్యార్థులు, సిబ్బంది, తల్లిదండ్రులు నేడు తిరిగి అదే ఆవరణలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. మానసిక దివ్యాంగులకు సేవలందిస్తున్న శ్రీనివాసరావును అభినందించారు. అనంతరం మానసిక దివ్యాంగుల అభ్యున్నతికి రూ. 20 వేల చెక్కును జయశ్రీ హరిబాబు దంపతులు నిర్వాహకుడు కండిపల్లి శ్రీనివాసరావుకు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రూప్ అధ్యక్షుడు డీవీఎస్ రాజు, కార్యదర్శి వీఎస్ఆర్‌కె ప్రసాద్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు విభాగం విద్యార్థులు, ప్రొఫెసర్లు

విద్యకు ప్రత్యామ్నాయం లేదు

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో దేనికైనా ప్రత్యామ్నాయం ఉంది కానీ విద్యకు లేదని ఏయూ తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ జర్రా అప్పారావు అన్నారు. సోమవారం ఏయూలోని తెలుగు విభాగంలో ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ల ఆత్మీయ సత్కార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏయూలో చదువుకున్న వాళ్లంతా ప్రపంచ వ్యాప్తంగా అనేక రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. పీజీ పూర్తి చేసిన విద్యార్థులు వెంటనే మరింత ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ గజ్జ యోహానుబాబు, డాక్టర్ యోగి వెంకటేశ్వర్లు, డాక్టర్ ఏ ఈశ్వరమ్మ, డాక్టర్ పెండ్యాల లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

నూతన మేయర్‌కు అభినందనలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ నూతన మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావుకు 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, అప్పారి గిరిబాబు శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తమ వార్డు అభివృద్ధికి సహకరించాలని మేయర్‌ను కోరానన్నారు. వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ కూడా జీవీఎంసీ కార్యాలయంలో మేయర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అలాగే పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి రాజశేఖర్ కూడా నూతన మేయర్‌కు అభినందనలు తెలిపారు.



మేయర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవగోపాల్

రిపోర్టర్లమంటూ బెదిరించిన నలుగురిపై కేసు

ఎలమంచిలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లైనుకొత్తూరు సమీపంలో రిపోర్టర్లమంటూ ఓ వ్యక్తిని బెదిరించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ ధనుంజయరావు తెలిపారు. సోమవారం రాత్రి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించిన వివరాలిలా వున్నాయి. కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం మల్లవరం గ్రామానికి చెందిన పోలవర్తి అప్పలనాయుడు ఆదివారం సాయంత్రం కోళ్ల వ్యర్థాలను వ్యాన్‌లో తరలిస్తుండగా లైనుకొత్తూరు సమీపంలో కారులో వచ్చిన నలుగురు వ్యక్తులు అడ్డుకున్నారు. తాము ప్రెస్ రిపోర్టర్లమని చెప్పి వ్యాన్ డ్రైవర్‌ను బెదిరించి రూ. 15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ డబ్బులు ఇవ్వకపోవడంతో అతని సెల్‌ఫోన్ లాక్కొని వెళ్లిపోయారు. దీంతో అప్పలనాయుడు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వ్యాన్ డ్రైవర్‌ను బెదిరించిన వ్యక్తులు విశాఖకు చెందిన చప్పా మోహన్ కృష్ణ, బంగారి భరత్, ఎండ్రపల్లి తిరుపతి, వానపల్లి శ్రీనువాసులుగా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని కారును సీజ్ చేశారు. నోటీసులు ఇచ్చి విడిచిపెట్టామని, పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని సీఐ చెప్పారు.

ఎండాడ బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా ఎల్లాజి

సాగర్‌నగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ మండల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా రుషికొండ ప్రాంతానికి చెందిన గరికిన ఎల్లాజి నియామితులయ్యారు. సోమవారం ఆయన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఎన్ఎం పరశురామరాజు చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో మరొకరి అరెస్టు

ఎండాడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కోసం మ్యూల్ బ్యాంక్ అకౌంట్స్ సప్లై చేస్తున్న వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. అతను గతంలో మహాదేవ్ యాప్‌లో పనిచేసి పట్టుబడి అరెస్టు అయ్యాడు. కశింకోటకి చెందిన ఈ వ్యక్తి గతంలో బెట్టింగ్‌లు నిర్వహించే వారితో పరిచయాలు వినియోగించి ప్రస్తుతం బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వారికి బ్యాంక్ అకౌంట్‌లను సమకూరుస్తున్నాడు. ఈ మేరకు పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

ఏయూలో దివ్యాంగ ఉద్యోగులపై వేధింపులు

రికార్డు, టెలీ ఎక్స్ఛేంజ్ సెక్షన్ ఉన్నతాధికారి తీరుతో ఇబ్బందులు

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని రికార్డు, టెలీఎక్స్ఛేంజ్ విభాగంలో పని చేసే చిరుద్యోగులపై ఉన్నతాధికారి వేధింపులకు దిగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలోనూ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ వేధింపులకు గురిచేయడంతో సీపీకు ఫిర్యాదు చేశారు. ఆ తరువాత వేధింపులు మరింత ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైకల్యాన్ని వెక్కిరించడం, ప్రతి చిన్న విషయానికి తీవ్ర పదజాలంతో దుర్భాషలాడడం, పనిచేయలేరంటూ ఎద్దేవా చేస్తూ మానసిక హింసకు గురిచేస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి విచారణ జరిపించాలని కోరుతున్నారు.

పనుల పురోగతిపై వీఎంఆర్డీఏ చైర్మన్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ప్రణవ్‌గోపాల్

సిరిపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):వీఎంఆర్‌డీఏ పరిధిలో జరుగుతున్న పనుల పురోగతిపై ఆ సంస్థ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ సోమవారం తన కార్యా లయంలో అధికారులతో సమీక్షించారు. ఎండాడ వద్ద నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజ లకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అలాగే వెంకోజిపాలెంలో పునర్నిర్మిస్తున్న కల్యాణ మండపం పనులను కూడా పూర్తి చేసి రాబోయే పెళ్లిళ్ల సీజన్ దృష్టిలో పెట్టుకొని అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ రమేశ్, చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా వీఎంఆర్డీఏ పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు జరగకుండా ఆ సంస్థ కమిషనర్ విశ్వనాథన్ నూతన కమిటీని పునరుద్ధరించారు.

చందనోత్సవ భక్తులకు ఉచిత బస్సులు

సింహాచలం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భక్తుల రద్దీ దృష్ట్యా ఈనెల 29 సాయంత్రం 6 గంటల నుంచి 30 రాత్రి వరకు సింహగిరిపైకి ప్రైవేటు వాహనాలను నిషేధించారు. భక్తుల రవాణాకు దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత బస్సులు ఏర్పాటు చేశారు. దేవస్థానానికి చెందిన నాలుగు బస్సులతోపాటు ఆర్టీసీకి అద్దె చెల్లించి 51బస్సులను ఉచితంగా నడుపుతున్నారు. 30న తెల్లవారుజామున 4.30 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు అందుబాటులో ఉంటాయి. పాతగోశాల, అడివివరం కూడలి వద్ద అందుబాటులో ఉంటాయి. రెండో ఘాట్‌రోడ్డులో రాకపోకలు సాగిస్తాయి. రూ.1000, రూ.1500 టికెట్లు తీసుకున్న భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక మినీ ఏసీ బస్సులను ఏర్పాటు చేశారు.

భక్తులు బస్సులు ఎక్కాల్సిన ప్రదేశాలు

1. ప్రొటోకాల్, వీవీఐపీలు కృష్ణాపురం గోశాల వద్ద
2. రూ.1500 టికెట్లు తీసుకున్న వారు అడివివరం గురుకుల పాఠశాల వద్ద
3. రూ.1000 టికెటు గల భక్తులు రెండో ఘాట్‌రోడ్డు టోల్‌గేటు పాతగోశాల వద్ద
4. రూ.300 టికెటు గల భక్తులు అడివివరం కూడలిలోని ఖాళీగ్రౌండ్, పాత గోశాల కూడలి వద్ద

దివ్యాంగులకు 30న సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్య దర్శనానికి అవకాశం కల్పించారు. ఒక సహాయకుని మాత్రమే అనుమతిస్తారు. పోలీసుల సూచనల మేరకు సింహగిరిపై సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. క్యూల నిర్వహణ, తాగునీటి సరఫరా, ప్రసాద వితరణకు వలంటీర్ల సేవలను వినియోగిస్తారు. ట్రాఫిక్ నియంత్రణల దృష్ట్యా దేవస్థానం, పోలీసు, మీడియా తదితర విభాగాలకు వారి ద్విచక్ర వాహనాలను సింహగిరిపై మైక్రోవేవ్ రిపీటర్ స్టేషన్ రోడ్డులో పార్కింగ్‌కు ఏర్పాటు చేశారు. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ద్వారా భక్తులను హెచ్చరికలు జారీ చేస్తారు. 108 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నారు. పూర్తి వివరాలకు 0891275 666 నంబరు సంప్రదించాలన్నారు.



విజేతలకు ప్రశంసాపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, పీవీఎన్ మాధవ్, తదితరులు

యోగా విజేతలకు సత్కారం

పెదవాల్తేరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 7న అరుకులో నిర్వహించిన మహా సూర్య నమస్కారాల కార్యక్రమంలో 21,850 మంది గిరిజన విద్యార్థులు పాల్గొని గిన్నిస్ రికార్డు సాధించారు. ఈ నేపథ్యంలో సోమవారం నగర బీజేపీ కార్యాలయంలో పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యోగా సాధకులు, యోగా విద్యార్థులు సుమారు 120 మందికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామరాజు మాట్లాడుతూ యోగా సాధన జీవన ప్రమాణాన్ని పెంచుతుందన్నారు. యోగాతో మానసిక ఉల్లాసం కలిగి అనేక రుగ్మతలు తగ్గుతాయన్నారు. మహా సూర్యవందనం ప్రపంచ రికార్డు విజేత, నిర్వాహకుడు పతంజలి శ్రీనివాస్, యోగా గురువులు శిష్టా శ్రీలక్ష్మి. అడపాక శంకరరావు తదితరులను సత్కరించారు. అనంతరం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ చైర్మన్ ఎం.శ్రీనివాస మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో యోగా ప్రాచుర్యం పొందిందన్నారు. 180 దేశాలకు పైగా జూన్ 21న యోగా డే నిర్వహిస్తున్నాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, బీజేపీ సీనియర్ నాయకురాలు కొల్లి రత్నకుమారి, కాటూరి రవీంద్ర, బీజేపీ ఏపీ వైద్యవిభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్, యోగా ప్రతినిధులు విజయ భారతి, మీనాక్షి, రవిశంకర్, శైలజ, మాధవి పాల్గొన్నారు.

మహిళా సమస్యలకు పరిష్కారం

ఆరిలోవ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆరిలోవ ప్రాంత ప్రజలకే కాక జిల్లాలో మహిళల సమస్యలను, వారి కుటుంబ తగాదాలను పోలీసుస్టేషన్‌కు వెళ్లకుండా పరిష్కరిస్తామని విశాఖ మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఎండీ సిస్టర్ నిర్మల అన్నారు. సోమవారం ఆరిలోవలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా ఆరిలోవ పరిర ప్రాంతాలతో పాటు కొమ్మాది, డాబాగార్డెన్స్, రేసవానిపాలెంలో మహిళలు, యువత, ట్రాన్స్‌జెండర్‌కు ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేశారు. మహిళలకు చట్టాల గురించి అవగాహన కలిగించానని తెలిపారు. 56 మంది మహిళలకు జిల్లా కోర్టులో పారా లీగల్ వలంటీర్లుగా శిక్షణ పొందారని పేర్కొన్నారు. గృహ హింస చట్టం, రైట్ టు ఫుడ్ టు ఇన్ఫర్మేషన్ వంటి చట్టాలను తెలుసుకున్నారని, ఆరిలోవ ప్రాంతంలో మధ్యాహ్న భోజన పథకాన్ని పర్యవేక్షించారన్నారు. చిన్న చిన్న సమస్యలపై కోర్టులకు వెళ్లకుండా ఇరుపక్షాలను కూర్చోబెట్టి పరిష్కరించగలిగామన్నారు. మహిళల సమస్యలు తమ దృష్టికి తెస్తే నిస్వార్థంగా పరిష్కరించి, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని సిస్టర్ నిర్మల తెలిపారు.

'విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి'

సింహాచలం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి చందనోత్సవంలో విధులు నిర్వహించే పోలీసులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బగ్చీ సూచించారు. సోమవారం సాయంత్రం ఆయన సింహాచలంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో చందనోత్సవంలో విధులు నిర్వహించనున్న పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులకు పలు సూచనలిచ్చారు. అన్ని శాఖలతో పూర్తి సమన్వయంతో మెలగాలని, సామాన్య భక్తులతో కూడా మర్యాదగా ప్రవర్తించాలన్నారు. భక్తులకు పూర్తి సహకారాన్ని అందిస్తూ ట్రాఫిక్ ఇబ్బందులపై నిరంతరం దృష్టిపెట్టాలన్నారు. ఘాట్‌రోడ్డులో కాని ఇతర ప్రాంతాల్లో గాని వాహనాలను రాంగ్ పార్కింగ్ చేస్తే హెవీ టోయింగ్ వాహనాన్ని వినియోగించి వాటిని తరలించాలని, క్యూల నిర్వాహణలో దేవస్థానం అధికారుల సూచనలు పాటించాలని చెప్పారు. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ అన్ని ప్రధాన ప్రాం తాల్లోనూ ఉండేలా చూడాలని సూచించారు. సుమారు 2 వేల మందితో నిర్వహిస్తున్న బందోబస్తులో డ్రోన్ సాంకేతికతను వినియోగించుకుంటున్నామని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవం విజయవంతం చేయడంలో పోలీసులు తమ విధులను నిర్వహించాలన్నారు.

సింహాచలంలో మద్యం దుకాణాలు మూసివేత

చందనోత్సవం సందర్భంగా సింహాచలం పరిసరాల్లోని నాలుగు మద్యం దుకాణాలను మూసివేస్తున్నట్టు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్. ప్రసాద్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అడవివరంలోని రెండు, గోసాల వద్ద ఉన్న ఒక దుకాణం, కాపు వీధిలో ఉన్న దుకాణాన్ని మంగళవారం సాయంత్రం 6 నుంచి గురువారం ఉదయం 6 వరకు మూసివేయాలని చెప్పారు.

'భూములు ఇవ్వం'

మహారాణిపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) ఆనందపురం మండలం తుర్లవాడ ఎస్సీ కాలనీలో ప్రభుత్వం చేపట్టిన ల్యాండ్ పూలింగ్‌ను తక్షణం రద్దుచేయాలని ఆ గ్రామ రైతులు సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ 80 మంది ఎస్సీ రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన 60 ఎకరాల భూమిపై రక్తపు బొట్లు చిందించి సాగుచేసుకుంటున్నామని, జీవనోపాధి పొందుతున్న సమయంలో ల్యాండ్ పూలింగ్ పేరుతో తమ భూములు తీసుకోవటం అక్రమమని, తాము వాటిని ఇవ్వదలచుకోలేదని స్పష్టం చేశారు.

ఇళ్లు నిర్మిస్తానని డబ్బు కాజేశాడు

» డాక్‌యార్డు ఉద్యోగిపై కలెక్టర్‌కు మహిళల ఫిర్యాదు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఆందోళనకారులు

మహారాణిపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) తక్కువ ధరకు ఇళ్లు నిర్మించి ఇస్తానని కూలీల నుంచి డబ్బులు వసూలు చేసిన డాక్‌యార్డు ఉద్యోగి పాల అప్పలరాజుపై చర్యలు తీసుకోవాలని పలువురు మహిళలు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. 28వ వార్డు రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన సుమారు 20 కూలీ కుటుంబాల నుంచి డాక్‌యార్డు ఉద్యోగి అప్పలరాజు సుమారు రూ.కోటి వసూలు చేసినట్లు తెలిపారు. ఇళ్లు నిర్మించకపోవడంతో తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే కులంపేరుతో దూషిస్తూ నెట్టేశాడని, పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవటం లేదని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని వారు కలెక్టర్‌ను అభ్యర్థించారు. రమణమ్మ, హేమ, రామలక్ష్మి, వెంకట సత్యవతి తదితరులు కలెక్టర్‌ను కలిసినట్లు చెప్పారు.

పది నెలలుగా జీతాల్లేవ్

ఉద్యోగాల పేరుతో మెస్సర్స్ కాంట్రాక్టర్ లక్షల రూపాయలు వసూలు చేసి కనీసం జీతాలు కూడా ఇవ్వడం లేదని జీవీఎంసీ కాంట్రాక్ట్ సంస్థపై చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శ్రీ దుర్గా కన్సల్టెన్సీ సర్వీసెస్ సంస్థ జీవీఎంసీలో వివిధ ఉద్యోగాల్లో నియమించిందని, పర్మినెంట్ అవుతాయని చెప్పి ఆ సమయంలో రెండు నుంచి నాలుగు లక్షల రూపాయలు వసూలు చేశారని తెలిపారు. గత 10 నెలలుగా జీతాలు చెల్లించని ఆ సంస్థపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'భూములను ల్యాండ్ పూలింగ్‌కు ఇవ్వం'

ఆనందపురం మండలం తుర్లవాడ ఎస్సీ కాలనీలో ప్రభుత్వం చేపట్టిన ల్యాండ్ పూలింగ్‌ను తక్షణం రద్దుచేయాలని ఆ గ్రామ రైతులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ 80 మంది ఎస్సీ రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన 60 ఎకరాల భూమిపై రక్తపు బొట్లు చిందించి సాగుచేసుకుంటున్నామని, జీవనోపాధి పొందుతున్న సమయంలో ల్యాండ్ పూలింగ్ పేరుతో మా భూములు తీసుకోవటం అక్రమమని, తాము వాటిని ఇవ్వదలచుకోలేదని స్పష్టం చేశారు.

దివ్యాంగుల పెన్షన్లు రీ అసెస్‌మెంట్

... 5వ పేజీ తరువాయి

జిల్లాలకు పంపింది. ఈ జాబితాలో కంటిచూపుతో బాధపడుతున్నవారు 2,372 మంది ఉండగా, 2,284 మంది అసెస్‌మెంట్ ప్రక్రియను అధికారులు పూర్తిచేశారు. మరో 88 మందిని చూడాల్సి ఉంది. అలాగే, మానసిక సమస్యలతో బాధపడుతూ పెన్షన్ పొందుతున్నవారు 4,391 మంది ఉండగా, వీరిలో 4,125 మంది (93.94 శాతం)ని తనిఖీ చేశారు. మరో 266 మందిని పరీక్షించాల్సి ఉంది. ఎముకల సంబంధిత సమస్యల వల్ల వైకల్యానికి గురై పెన్షన్ పొందుతున్నవారు 11,481 ఉండగా ఇప్పటివరకూ 3,487 మంది (30.37 శాతం)కి రీ అసెస్‌మెంట్ ప్రక్రియను అధికారులు పూర్తిచేశారు. మరో 7,994 మందికి పరీక్షించాల్సి ఉంది. అలాగే, వినికిడి సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారు 2,289 మంది ఉండగా, ఇప్పటివరకూ 549 మంది (23.98 శాతం)కి అసెస్‌మెంట్ ప్రక్రియను పూర్తిచేశారు. మరో 1,740 మందిని పరీక్షించాల్సి ఉంది. పలు రకాల వైకల్యాలతో బాధపడుతున్న 773 మంది అసెస్‌మెంట్ ప్రక్రియను ఇంకా ప్రారంభించలేదు. మొత్తం జిల్లాలో రీ అసెస్‌మెంట్ చేయవలసిన పెన్షనర్లు 21,306 మంది ఉండగా ఇప్పటివరకూ 10,445 మంది (49.02 శాతం)కి తనిఖీ ప్రక్రియ పూర్తయింది. మరో 10,861 మందిని తనిఖీ చేయాల్సి ఉంది.

రీ అసెస్‌మెంట్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం

పెన్షనర్ల రీ అసెస్‌మెంట్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకూ 49 శాతం మేర పూర్తయింది. మిగిలిన వారికి స్లాట్లు కేటాయించారు. రీ వెరిఫికేషన్‌కు గడువు ఏమీ లేదు. అనర్హులు ఎవరూ పెన్షన్లు పొందకూడదు. అర్హులు ఎవరూ నష్టపోకూడదన్నది ప్రభుత్వ ఉద్దేశం. అందుకు అనుగుణంగా అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా ప్రక్రియను చేపడుతున్నాం.

- పిడుగు శంకర ప్రసాద్, డీసీహెచ్ఎస్

ఐటీఐల్లో ప్రవేశాలకు నేటి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

కంచరపాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐల్లో 2025-26 విద్యాసంవత్సరానికి ప్రవేశాల నిమిత్తం నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. పదోతరగతి పాసైన అభ్యర్థులు మంగళవారం నుంచి ఐటిఐ.ఎపి.జిఓవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను అందజేయాలని సూచించారు. రిజిస్ట్రేషన్లు చేసుకున్న అభ్యర్థులు సమీపంలో గల ప్రభుత్వ ఐటీఐకి హాజరై ధ్రువపత్రాలను పరిశీలింపచేసుకుని రసీదు పొందాలన్నారు. ధ్రువపత్రాలు పరిశీలించని అభ్యర్థుల పేర్లు మెరిట్ లిస్టులో రావన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి మే నెల 24 వరకు గడువు ఉందన్నారు. స్టీల్ ప్లాంట్ భూ బాధితులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్స్ చేసుకునే సమయంలో స్పెషల్ కేటగిరీ అని మాత్రమే పేర్కొనాలన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ, బాలికల ఐటీఐ, నరవ ఐటీఐ, గాజువాకలో గల న్యూఐటీఐలో ధ్రువపత్రాల పరిశీలనకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశామన్నారు.

రైతులకు స్టాల్స్ కేటాయింపు

సీతమ్మధార, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార రైతుబజార్‌లో సోమవారం డ్రా తీసి రైతులకు స్టాల్స్ కేటాయించారు. ఎస్టేట్ అధికారి రైతుల సమక్షంలో పారదర్శకంగా దీన్ని నిర్వహించారు. రైతులు తెచ్చుకున్న కూరగాయలను వారికి కేటాయించిన స్టాల్స్‌లో అమ్ముకోవచ్చని ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి తెలిపారు.

మేయర్ పీలాకు ఎమ్మెల్యే అభినందన



పీలా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నగర మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన పీలా శ్రీనివాసరావుకు ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే వి.విష్ణుకుమార్‌రాజు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. విశాఖ అభివృద్ధికి కీలక పాత్ర పోషించాలని, కొత్త కార్యక్రమాలతో నగరాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా చీకటి రమేష్



మహారాణి పేట: ప్రైవేట్ పాఠశాలల (అప్సా) రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా విశాఖకు చెందిన చీకటి రమేష్ నియమితులయ్యారు. విజయవాడలో సోమవారం జరిగిన ప్రైవేట్ పాఠశాలల సర్వసభ్య సమావేశంలో రమేష్‌ను ఎంపిక చేశారు. విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించడానికి, ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి సమర్థంగా కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో పలు జిల్లాల ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శిగా మిథు



మిథును అభినందిస్తున్న అప్సా ప్రముఖులు

కంచరపాలెం: అప్సా రాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శిగా కంచరపాలెంలోని న్యూటన్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ బి.మిథును ఎన్నుకున్నారు. రాష్ట్ర చైర్మన్ సుందరరామ్, అధ్యక్షులు సుబ్రహ్మణ్యంరాజు, ఉపాధ్యక్షులు బి.శ్రీనివాసరావు సోమవారం విజయవాడలో నియామకపత్రాన్ని ఆమెకు అందజేశారు. బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని ఆమె అన్నారు. మిథును అప్సా విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.రామకృష్ణ, ఉపాధ్యక్షుడు డి.వి.శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్ ఉపాధ్యాయులు అభినందించారు.

వర్తమాన చరిత్రను రచయితలే అర్థం చేసుకోవాలి

» సాహితీవేత్త తెలకపల్లి రవి



ప్రసంగిస్తున్న సాహితీవేత్త తెలకపల్లి రవి

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): చరిత్ర ఆనవాళ్లు...వాటి పరిస్థితులను మనుషులు నిర్మిస్తే, ఆ మహా మనుషులను చరిత్ర నిర్మిస్తోందని ప్రముఖ సాహితీవేత్త తెలకపల్లి రవి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఉత్తరాంధ్ర సాహితీ విశాఖపట్నం ఆధ్వర్యంలో 'ఉత్తరాంధ్ర సాహితీ వీచికలు- రైటర్స్ ఇష్టాగోష్ఠి నిర్వహించారు. సమాజంపై వికృత, విధ్వంసక భావాల విస్ఫోటనాన్ని అడ్డుకునేందుకు సున్నితమైన భావజాలపు అక్షరాన్ని నిలబెట్టుకోవాలని, అది రచయితలు, కవులకే సాధ్యమన్నారు. నేటి సామాజిక పరిస్థితుల్లో రాజకీయం కానిదంటూ ఏదీ లేదన్నారు. మన ముందు నడుస్తున్న చరిత్రను ఎలా అర్థం చేసుకోవాలో కవులు, రచయితలు ఆలోచన చేయాలన్నారు. 'ప్రశ్నిస్తా' అన్న ఒక నటుడు ప్రస్తుతం సనాతన ధర్మం అంటూ వాటిని మరిచిపోయారని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన సాహితీవేత్త అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ సామాజిక వాస్తవాలను రచయితలు గ్రహించాలన్నారు. ఇష్టాగోష్ఠిలో భాగంగా రచయితలు, కవులు తమ అభిప్రాయాలను కుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమానికి సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీకటి దివాకర్, శాస్త్రి, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, ఉప్పాడ రాము, ఎ.రవిశేఖర్, సాహితీస్రవంతి జిల్లా కార్యదర్శి పి.రామారావు, జిల్లా అధ్యక్షుడు ఫ్రాన్సిస్, జి.సుబ్బరాజు, దేవీశ్రీ, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

పాలీసెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



సూపరింటెండెంట్లు, పరిశీలకులతో సమావేశమైన ఆర్జేడీ సత్యనారాయణమూర్తి

కంచరపాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30న పాలీసెట్ సజావుగా జరపడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని సాంకేతిక శాఖ జోన్-1 రీజనల్ జాయింట్ డైరెక్టర్ జె.సత్యనారాయణమూర్తి తెలిపారు. పరీక్ష నిర్వహణపై సోమవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో సూపరిండెంటెంట్లు, పరిశీలకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 22 కేంద్రాల్లో 9,383 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారన్నారు. బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 10 నుంచి పరీక్షా కేంద్రంలోకి రావచ్చని, 11 గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమన్నారు. విద్యార్థులు హాల్ టిక్కెట్లతో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకుని రావాలని సూచించారు. పాలీసెట్ జిల్లా కో-ఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు మాట్లాడుతూ కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంటాయన్నారు. సమావేశంలో అన్ని విభాగాల అధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

బాలుడికి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం



శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యులు, కేజీహెచ్ సూపరింటెండెంట్‌తో బాలుడు యశ్వంత్

మహారాణిపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో బాలుడికి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన యశ్వంత్ (16) అనే బాలుడికి రెండేళ్లుగా మూత్రపిండాల (కిడ్నీ) వ్యాధి ఉంది. వైద్యచికిత్స కోసం ఇటీవల కేజీహెచ్‌లో చేరాడు. నెఫ్రాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ జి.ప్రసాద్ నిర్వహించిన వైద్య పరీక్షల్లో కిడ్నీ మార్చాల్సిన ఆవశ్యకతను గుర్తించారు. అవయవదానంతో యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాల ఆధ్వర్యంలో ఈ నెల 7న శస్త్రచికిత్సను నిర్వహించారు, అనంతరం వైద్యుల పర్యవేక్షణలో బాలుడు పూర్తిగా కోలుకోవటంతో సోమవారం ఆసుపత్రి నుంచి ఇంటికి పంపారు. ప్రైవేటు ఆసుపత్రులలో సుమారు రూ.15 లక్షల వ్యయమయ్యే ఈచికిత్సను ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా పూర్తి ఉచితంగా చేయించారు. బాలుడికి విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించిన యూరాలజీ హెచ్‌వోడీ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రాంబాబు, డాక్టర్ శ్రీలక్ష్మి తదితరులను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ అభినందించారు.

ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు కూల్ జాకెట్లు



కూల్ జాకెట్లు ధరించిన పోలీసు సిబ్బందితో నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి

మహారాణిపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఠారెత్తిస్తున్న ఎండల్లో విధి నిర్వహణలో ఇబ్బంది పడుతున్న ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగించే కూల్ జాకెట్లను పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం పంపిణీ చేశారు. పోలీసు కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి చల్లదనం అందించే రేడియం కూల్ జాకెట్లను తెప్పించారు. దాతల సహకారంతో సుమారు రూ.5 లక్షల విలువైన 200 కూల్ జాకెట్లను గురుగ్రామ్ నుంచి తెప్పించి పంపిణీ చేశారు. వీటి ద్వారా సుమారు 8 డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గుతుందని తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

సీతంపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడి చికిత్స అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న రోగుల కుటుంబాలకు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం చెక్కుల ద్వారా ఆర్థిక సహాయం మంజూరైంది. సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన నగర కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం ఈ చెక్కులను బాధితులకు అందచేశారు. యుగంధర్‌కు రూ.1,19,681, బొడ్డు నరసింహమూర్తికి రూ.1,77,852, హుస్సేన్‌కు 7,09,366 చెక్కులను ఎమ్మెల్యే అందచేశారు.

41వ వార్డులో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం

జ్ఞానాపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఉపాధి కోసం నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం 41వ వార్డులోని జ్ఞానాపురం జెఎన్ఎన్ఎంయూఆర్ఎం కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమంలో జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము, ఏపీడీ పుణ్యవతి, జనసేన దక్షిణ నియోజకవర్గం నాయకులు శివప్రసాద్, వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతి మదుబాబు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

జ్ఞానాపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మే 14 నుంచి 18 వరకు జరగనున్న జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయ వార్షికోత్సవాల బ్రోచర్‌ను సోమవారం ఆలయ ఆవరణలో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా 17న తొలేళ్ల, 18న ప్రధాన ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ డి.వి.ఎస్.సురేష్ బాబా, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ కార్డుల పంపిణీ

మాధవధార, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జనసేన 51వ వార్డులో కొత్తగా సభ్యత్వం పొందిన వారికి సోమవారం ఆ పార్టీ నార్త్ ఇంచార్జి పి.ఉషాకిరణ్ గుర్తింపు కార్డులు అందజేశారు. పార్టీ అధ్యక్షుడు కె.పవన్ కల్యాణ్ ఫోటో, సంతకంతో రాజకీయ చైతన్యం కల్గిస్తూ ఉన్న ప్రశంసా పత్రాలు, పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని ధ్రువపరుస్తు సభ్యునిగా చేరిన వారి ఫోటో చిరునామాలతో ఉన్న కార్డుల్ని అందజేశారు. వార్డు పార్టీ అధ్యక్షుడు జి.అప్పారావు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు

... 5వ పేజీ తరువాయి

ఐసీఎస్ఈలో ప్రవేశాలు పొందేందుకు మార్చి 31 నాటికి ఐదేళ్లు, రాష్ట్ర సిలబస్‌లో ప్రవేశాలకు మే 31 నాటికి ఐదేళ్లు పూర్తయిన బాలబాలికలు ఒకటో తరగతిలో ప్రవేశాలకు అర్హులన్నారు. దీనికి అనుగుణంగా జిల్లాలో 621 ప్రైవేటు పాఠశాలలు విద్యాహక్కు చట్టం 12(1)సీ కింద నమోదైనట్టు వెల్లడించారు. కాగా ప్రవేశాలకు సంబంధించి సోమవారం ఆయన మండల విద్యాశాఖాధికారులు, కార్యాలయ సిబ్బందితో సమీక్షించారు.

'మతస్వేచ్ఛ అవసరం'



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జె.వి. ప్రభాకరరావు, పాల్గొన్న ఇతర ప్రతినిధులు

సీతంపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మన దేశ లౌకిక విధానం ప్రకారం ప్రజలకు మత స్వేచ్ఛ ఉండాలని, ప్రభుత్వం ఏ మతాన్ని ప్రోత్సహించరాదని, కానీ లౌకిక వాదానికి హాని కలిగించే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందని వక్తలు అభిప్రాయం వ్యక్తంచేశారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్), దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) సంయుక్త ఆధ్వర్యంలో 'మతస్వేచ్ఛ, భారత రాజ్యాంగం' అనే అంశంపై సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి వక్తలుగా విచ్చేసిన డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకరరావు, సీపీఎం కేంద్ర సభ్యుడు కొత్తపల్లి లోకనాథం, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చిరంజీవి, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు తదితరులు మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ ముసుగులో హిందూవాదాన్ని బలవంతంగా రుద్దాలనే ప్రయత్నాన్ని అడ్డుకోవాలన్నారు. ఎంతో చరిత్ర కలిగిన భారత రాజ్యాంగాన్ని పక్కనపెట్టి మను సంస్కృతిని ప్రవేశ పెట్టాలనే ప్రయత్నాలు మొదలు పెట్టారని, ఇప్పటికే ఆర్ఎస్ఎస్ 'ఒకే దేశం ఒకే ఎన్నిక', ఒకే పౌరస్మృతి వంటి వాదనలు ప్రజల ముందుకు తెస్తున్నారన్నారు. లౌకిక వాదానికి, ముస్లిం, క్రిస్టియన్ తదితర మైనారిటీ ప్రజలకు తీరని నష్టం కలిగిస్తుందని, ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘాల ప్రతినిధులు సుబ్బన్న, బాగం లక్ష్మి, బొడ్డు కల్యాణరావు, పైడిరాజు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌గా కోన తాతారావు

... 5వ పేజీ తరువాయి

చైర్మన్‌గా నియమితులైన కోలా గురువులు గత ఏడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి జాయింట్ కలెక్టర్ పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో కూటమి ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని భావించింది. అయితే అది కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో సోమవారం నామినేటెడ్ పద్ధతిలో చైర్మన్లను నియమించింది. చైర్మన్‌గా కోన తాతారావు నియామకంపై రెండు, మూడు రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఆయనతోపాటు డీసీసీబీ బోర్డులో మరో ఆరుగురిని ప్రభుత్వం నియమించనున్నది. ఇదిలావుండగా ఈనెల ఎనిమిదో తేదీన కోన తాతారావు పరవాడ మండలం లంకెలపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యత్వం తీసుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 30కుపైగా బ్రాంచీలు, 98 సహకార సంఘాలు కలిగిన డీసీసీబీ రాష్ట్రంలో అత్యధిక వ్యాపార లావాదేవీలు జరిపే ఐదింటిలో ఒకటిగా ఉంది.

ఉక్కు ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి...

పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన కోన తాతారావు న్యాయశాస్త్రంలో పట్టభద్రులు. నిర్వాసితుడు కోటాలో విశాఖ ఉక్కు కర్మాగారంలో ఉద్యోగిగా చేరి మేనేజర్ హోదా వరకూ పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. అనంతరం రాజకీయ ప్రవేశం చేశారు. తొలుత పెదగంట్యాడ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన తాతారావు ఉమ్మడి రాష్ట్రంలో 1993లో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, తరువాత చైర్మన్‌గా సేవలు అందించారు. 2004లో కాంగ్రెస్ పార్టీని వదిలి తెలుగుదేశంలో చేరిన తాతారావు 2007లో కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. జీవీఎంసీలో టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌గా, 2009లో అర్బన్ జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2018లో టీడీపీని వీడి జనసేనలో చేరిన తాతారావు ప్రస్తుతం ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా ఉన్నారు.

చందనోత్సవానికి సర్వం సిద్ధం

... 5వ పేజీ తరువాయి

చేస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాది రూ.1500, రూ.1000, రూ.300 టికెట్లు విక్రయించామన్నారు. ప్రవేశ ద్వారం వద్ద, లోపల పంచింగ్, స్కానింగ్ చేయడం ద్వారా రీసేల్‌ను నిరోధించనున్నట్టు చెప్పారు. ఉచిత దర్శనాలు తెల్లవారుజామున నాలుగు గంటలకు ప్రారంభమవుతాయన్నారు. సింహగిరిపై పార్కింగ్ స్థలం చాలా తక్కువగా ఉన్నందున, కొండదిగువనే అధిక ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటుచేశామన్నారు. భక్తులందరూ తప్పనిసరిగా సొంత వాహనాలను కొండ దిగువనే వదిలి దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత రవాణా సదుపాయాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఉచిత ప్రయాణానికి 45 ఆర్టీసీ బస్సులు, 40 మినీ బస్సులు, 15 ఇన్నోవాలను దేవస్థానం అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఉచితం, రూ.300, రూ.1000 క్యూలలోని భక్తులను తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి దర్శనాలకు అనుమతిస్తామన్నారు. ప్రధానమైన అంతరాలయ దర్శనాలను బుధవారం ఉదయం ఆరు గంటల తరువాత పూర్తిగా నిలిపివేస్తున్నట్టు ఈవో పేర్కొన్నారు.

మేయర్ పీఠంపై పీలా

... 5వ పేజీ తరువాయి

బల్లలు చరిచి హర్షం వ్యక్తంచేశారు. మేయర్‌గా ఎన్నికైనట్టు పీలా శ్రీనివాసరావుకు జాయింట్ కలెక్టర్ ధ్రువీకరణ పత్రం అందజేసి, ఆయన చేత ప్రమాణం చేయించి సమావేశం ముగిసినట్టు ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణశ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, గణబాబు, పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్‌బాబు, కొణతాల రామకృష్ణ, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కూటమి కార్పొరేటర్లు, జీవీఎంసీ అధికారులు, కూటమి నేతలతోపాటు అభిమానులు నూతన మేయర్ పీలా శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

మేయర్‌గా పీలా ఎన్నికతో జీవీఎంసీ కార్యాలయం బయట టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అభిమానులు క్రేన్‌పై భారీ గజమాలను తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ నిస్వార్థంగా పనిచేస్తానన్నారు. సీఎం చంద్రబాబునాయుడు చెప్పినట్టు విలువలతోపాటు పార్టీ, ప్రభుత్వ విధానాలకు లోబడి పనిచేస్తానన్నారు. తనకు మేయర్‌గా అవకాశం కల్పించిన కార్పొరేటర్లు, కూటమి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత నాలుగేళ్లలో వైసీపీ నేతలు జీవీఎంసీలో చేసిన అవినీతి కారణంగానే అవిశ్వాసం పెట్టాల్సి వచ్చిందన్నారు. వైసీపీ నేతలు ఆరోపించినట్టు తాము కార్పొరేటర్లను ప్రలోభాలకు గురిచేయలేదని, బెదిరించలేదన్నారు. వారి అక్రమాలను భరించలేక స్వచ్ఛందంగా మేయర్‌ను దింపేందుకు తమతో కలిసి వచ్చారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన, నగర అభివృద్ధికి అందరం ఐక్యంగా పనిచేస్తామన్నారు. కార్పొరేషన్ చరిత్రలో టీడీపీ నుంచి 1987లో మొదటిసారి డీవీ సుబ్బారావు మేయర్‌గా ఎన్నికవ్వగా, రెండో వ్యక్తి పీలా శ్రీనివాసరావు కావడం విశేషం.

నగర అభివృద్ధికి నా శక్తిమేరకు కృషి

... 5వ పేజీ తరువాయి

పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. వైసీపీ నాలుగేళ్ల పాలనలో నగరాన్ని అధోగతి పాల్జేశారని, వీధి లైట్లు వెలిగించుకోలేని దుస్థితికి జీవీఎంసీని నెట్టేశారని పీలా విమర్శించారు. మేయర్‌గా తనకు తక్కువ కాల వ్యవధే ఉన్నప్పటికీ...ఉన్నంతలో బాగా చేశానని ప్రజలు అనుకునేలా నగరాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ప్రతి వార్డులోనూ వీధి లైట్లు వెలిగేలా చేయడంతోపాటు పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తానన్నారు. వేసవిలో తాగునీరు సక్రమంగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఒక కార్యాచరణ రూపొందించుకుని దానిప్రకారం అధికారులతో కలిసి నగర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానన్నారు. వైసీపీ నాలుగేళ్ల పాలనలో చాలా లోపాలు ఉన్నాయని, వాటిపై సమీక్షించిన తర్వాత చట్ట ప్రకారం అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు, జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

టికెట్లు... ఇక్కట్లు

... 5వ పేజీ తరువాయి

జిల్లాల ప్రజా ప్రతినిధులే కుండా ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి నాయకులు వస్తుండడం వల్ల ఆ టికెట్లకు డిమాండ్ ఏర్పడింది. సోమవారం రాత్రి వరకు వీటిని ఎవరికీ జారీ చేయలేదు. ఒకరోజు ముందుగా అంటే మంగళవారం ప్రజా ప్రతినిధులకు, వీవీఐపీలకు, ప్రొటోకాల్ వ్యక్తులకు ఇవ్వనున్నారు. ఇవే టికెట్లను ఆశిస్తూ నగరంలో ప్రముఖులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకున్నారు. వారికి కూడా సోమవారం వరకూ ఎటువంటి సమాచారం రాలేదు. ఈ టిక్కెట్ ఉంటే అంతరాలయ దర్శనం జరుగుతుందంటున్నారు. అందుకని వాటికి డిమాండ్ పెరిగింది. ఎవరికి ఇస్తారో, ఎన్ని ఇస్తారో వేచి చూడాల్సి ఉంది.

దొరకని రూ.వేయి టిక్కెట్లు

అన్నీ సక్రమంగా ఉంటే వేయి రూపాయల టికెట్‌తో గంట నుంచి రెండు గంటల వ్యవధిలో దర్శనం చేసుకోవచ్చు. అందుకని వీటి కోసం చాలామంది ప్రయత్నించారు. అయితే ఈ టికెట్లు అయిపోయాయని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు. ప్రతి ఏడాది దేవస్థానం ఏఈఓలు ఈ టికెట్లను బ్లాక్ చేయించి, వారికి అవసరమైన వారికి అమ్ముకుంటున్నారు. ఈసారి కూడా అదే జరిగింది. ఈ టికెట్లు ఎన్ని ముద్రించారో అధికారులు వెల్లడించలేదు. అప్పుడే ఎలా అయిపోయాయో ఎవరికీ అర్థం కావడం లేదు. దీనిపై ఏ అధికారీ స్పందించడం లేదు.

అందుబాటులో రూ.300 టికెట్లు...

టికెట్ తీసుకొని త్వరగా దర్శించుకొని వెళదామనుకునే భక్తులకు ప్రస్తుతం రూ.300 టికెట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అవి కూడా మధ్యాహ్నం తరువాత దర్శనానికి సంబంధించినవి ఉన్నాయని, ఉదయం దర్శనానివి లేవని సిబ్బంది చెబుతున్నారు. ఇవన్నీ చూస్తుంటే ఎప్పటిలాగే దేవస్థానం సిబ్బంది చక్రం తిప్పారని అర్థమవుతోంది.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

» టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

» ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం



పల్లా శ్రీనివాసరావు, జగన్, తదితరులను సత్కరించిన ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సృష్టికి మూలం స్త్రీ అని, మహిళలందరూ అన్ని రంగాల్లో రాణించి మహిళాసాధికారతను సాధించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. వడ్లపూడి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. మరో అతిథి గాజువాక తహశీల్దార్ తోట శ్రీవల్లి మాట్లాడుతూ తొలి గురువు అమ్మ అని, ఆమె నుంచే సమాజానికి ఉపయోగపడే మానవత, నైతిక విలువలను అందిపుచ్చుకోవాలన్నారు. మహిళలందరూ ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాలలో రాణించాలన్నారు. కార్పొరేటర్ బొండా జగన్ మాట్లాడుతూ టీడీపీ మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందన్నారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలను ఘనంగా సత్కరించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బుల్లితెర నటులు పావని, నయన, జి.మంజుల, సైకాలజీ కౌన్సెలర్ మాధవి గణపతి, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కారుమూరి మహేశ్, ప్రతినిధులు కె.సుజాత, ఎస్.రాధ, కె.విజయ, ఆర్.నాగలక్ష్మి, చంద్రకళ, స్వర్ణలత, సత్య, ములుకూరి వెంకటరమణ, మధుసూదనశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల తొలగింపు దుర్మార్గం

» కేంద్ర నిర్ణయాలతో స్టీల్‌ప్లాంట్ భవితవ్యం ప్రశ్నార్థకం

» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు


ధర్నా శిబిరం వద్ద మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ప్రక్రియ దుర్మార్గమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం ప్లాంట్ పరిపాలన భవనం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న విధానాలతో స్టీల్‌ప్లాంట్ రక్షణ ప్రశ్నార్థకంగా మారిందని, ఉక్కు రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం ఇప్పటికైనా విరమించుకోవాలని, సకాలంలో జీతాలు ఇవ్వడంతో పాటు వేతన బకాయిలను చెల్లించాలన్నారు. ఇంకా కార్యరూపం దాల్చని ప్రైవేటు పరిశ్రమలకు క్యాపిటివ్ పోర్టు నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేందుకు, సొంత గనులు కేటాయించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉక్కు కార్మికులు అన్ని విధాల ఇబ్బందులు పడుతున్నారన్నారు. 110 శాతం ఉక్కు ఉత్పత్తి చేస్తున్నప్పటికీ ఉద్యోగులు జీతాల కోసం నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు యు.రామస్వామి, ఎన్.రామారావు, బి.అప్పారావు, బి.శ్రీనివాసరాజు, గంగాధర్, రాజా, మరిడయ్య, పుల్లారావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

కార్మికుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా తాము ముందుకు సాగుతున్నామని బీఎంఎస్ స్టీల్ ఫెడరేషన్ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. బీఎంఎం స్టీల్ ఫెడరేషన్ త్రైవార్షిక సమావేశం స్టీల్‌ప్లాంటులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గం బలహీనమైందని, కార్మికుల ప్రయోజనాల కోసం తామెంతో కృషి చేస్తున్నామన్నారు. స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరించరాదని, కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదన్నారు. అనంతరం పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ఉక్కు కర్మాగారంలో వేతన సవరణ జరపాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని, సెయిల్‌లో ప్లాంటును విలీనం చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో బీఎంఎస్ ప్లాంట్ అధ్యక్షుడు ఎం.రామస్వామి, ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల రమణ, నాయకులు డీకే పాండే, మంత్రి గణేశ్, ఎం.జగదీశ్వరరావు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నగర్‌లో ఆక్రమిత స్థలాన్ని పరిశీలించిన తహశీల్దార్

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి శ్రీగణేశ్ నగర్‌లో సర్వే నంబర్-49/4లో ఆక్రమణకు గురైన స్థలాన్ని సోమవారం గాజువాక తహశీల్దార్ తోట శ్రీవల్లి పరిశీలించారు. ఇటీవల ఈ ప్రాంతంలో 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో స్థానికులు గణేశ్ నగర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఇది ప్రభుత్వ స్థలమని హెచ్చరిక బోర్డులు పెట్టినా కబ్జాదారులు తొలగించి యథేచ్ఛగా నిర్మాణ పనులు చేపడుతున్నట్టు అధికారులకు స్థానికులు వివరించారు. ఈ నేపథ్యంలో తహశీల్దార్ సోమవారం ఈ స్థలాన్ని పరిశీలించి, ఇక్కడ ఆక్రమణలను తొలగించడంతో పాటు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ స్థలాలను ఎవరు ఆక్రమించినా ఉపేక్షించేది లేదన్నారు. ఈ స్థలంలో వద్ద సుమారు 300 గజాల్లో నిర్మించిన ఇంటి నిర్మాణంపై కూడా తగిన విచారణ చేపడతామని తహశీల్దార్ శ్రీవల్లి పేర్కొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ శ్రీవల్లి

చెక్కు అందజేత

కూర్మన్నపాలెం,ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా మీ ఇంటి పెద్ద కొడుకుగా ఉంటానని హామీ ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 87వ వార్డు దుగ్గపువానిపాలెంలో అనారోగ్యంతో బాధ పడుతున్న దుగ్గపు శ్రీలతకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4,50,000 చెక్కును పంపారు. ఈ చెక్కును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ సోమవారం శ్రీలత ఇంటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, డీవీ అప్పారావు, ప్రగడ దానయ్య, ఎం.రాము, డి.రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి వాసికి మేయర్ పీఠం

» స్థానికుల్లో హర్షాతిరేకాలు

పెందుర్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ మేయర్‌గా పీలా శ్రీనివాసరావు ఎన్నికవడంతో ఈప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శివారు ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నారు. జీవీఎంసీకి 2021లో ఎన్నికలు జరగ్గా, అధికార వైసీపీని దీటుగా ఎదుర్కొని పీలా ముందుకునడిచారు. దీంతో ప్రచారానికి వచ్చిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు మేయర్ అభ్యర్థిగా పీలా శ్రీనివాసరావు పేరును ప్రకటించారు. అయితే ఆ ఎన్నికల్లో మెజారిటీ రాలేదు. తాజాగా జరిగిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో పీలాకు పదవి దక్కింది. 96వ వార్డు కార్పొరేటర్‌గా 6,290 ఓట్ల అత్యధిక మెజారిటీతో పీలా ఎన్నికల్లో గెలిచారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ హోదాలో వైసీపీ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడారు.

ఆదినుంచి టీడీపీ వెన్నంటే...

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్న పీలా శ్రీనివాసరావు తన తండ్రి పీలా మహాలక్ష్మినాయుడు రెండుసార్లు పెందుర్తి ఎంపీపీగా ఎన్నికవడంలో ప్రధాన భూమిక వహించారు. పెందుర్తితో పాటు విశాఖ నగర టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. అనకాపల్లి నుంచి బరిలోకి దిగిన సోదరుడు పీలా గోవిందసత్యనారాయణ విజయానికి కృషి చేశారు. పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా రెండు సార్లు, ఉత్తర నియోజవర్గ ఇన్‌చార్జిగా పనిచేశారు.

పెందుర్తిలో సందడి

పీలా అభిమానులు, టీడీపీ కార్యకర్తలు పెందుర్తి కూడలిలో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి సందడి చేశారు. మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన పీలాకు శుభాకాంక్షలు తెలిపారు. పీలా మహాలక్ష్మినాయుడు మూడో కుమారుడు పీలా శ్రీనివాసరావుకు భార్య ధనలక్ష్మి, కుమారుడు ధీరజ్, కుమార్తె దీపక ఉన్నారు. సోదరులు కృష్ణ అప్పారావు వ్యాపారవేత్తగా స్థిరపడగా, గోవింద సత్యనారాయణ ఎమ్మెల్యేగా పనిచేశారు.


తల్లిదండ్రుల చిత్రపటం వద్ద మేయర్ పీలా శ్రీనివాసరావు

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మల్కాపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ములగాడ మండల విద్యాశాఖాధికారి డీవీ త్రినాథరావు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞా న శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్, ఉపాధ్యాయులు పి.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. విద్యార్థులకు విజ్ఞానం, వినోదం, పుస్తక పఠనం, క్విజ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: చిరిగిన చొక్కా అయినా తొడుక్కో పరవాలేదు కానీ మంచి పుస్తకాన్ని కొనుక్కో అని మహాత్మాగాంధీ అన్నారని, మంచి పుస్తకాలను చదివితే మంచి విజ్ఞానంతో పాటు నైతిక విలువలను సొంతం చేసుకోవచ్చని ఆధ్యాత్మికవేత్త అద్దంకి రాఘవాచార్యులు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో పలు పోటీలు నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులందరూ మహాత్ముల జీవిత చరిత్రలను చదవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీ రమణ, ఉపాధ్యాయుడు హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మెట్టమాంబకు వైభవంగా జలాభిషేకం

పెందుర్తిరూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలఅగ్రహారం గ్రామ దేవత మెట్టమాంబ ఉత్సవాలలో భాగంగా సోమవారం జలాభిషేకాలు నిర్వహించారు. ఘటాలలో జలాలు నింపి మహిళలు ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ప్రదక్షిణల అనంతరం అమ్మవారికి జలాభిషేకం చేశారు. ధర్మకర్త మద్దాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సర్పంచి దాడి గోపి అప్పలనాయుడు, పి.అప్పారావు, పి.వెంకటరమణ, ఆళ్ల తాతారావు, వరలక్ష్మిఅర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

మల్కాపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం రెండు గుళ్ల మార్గంలో సోమవారం బీజేపీ నాయకులు చలివేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు పేదలకు చీరలు పంపిణీ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పరుశరామ్‌రాజు, మాజీ కార్పొరేటర్, కలిదండి బద్రీనాథ్, ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడారు. కేంద్రం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యతను కార్యకర్తలు తీసుకోవాలన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలిమేర శ్రీనివాసరావు, గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, సంతోశ్, సురేష్, అనుదీప్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు


గాజువాక డిపో ఎదుట ఉద్యోగుల నినాదాలు

మల్కాపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం గాజువాక ఆర్టీసీ డిపో ఎదుట ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. తొలిరోజు 28 మంది దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి పి.శంకరరావు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని, 114 జీవోలో పొందుపరి ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నప్పటికీ న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయడం లేదన్నారు.

వేపగుంట: రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సింహాచలం డిపో ఎదుట ఆర్టీసీ ఉద్యోగుల రెండురోజుల రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని ప్రారంభించారు. ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి కేవీర్ నరసింగరావు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు పీఎస్ మూర్తి, కార్యదర్శి శంకరరావు, డిపో అధ్యక్ష కార్యదర్శులు డీపీ నాయుడు, రాజు, బీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తిలో చిరు జల్లులు

పెందుర్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలతో అల్లాడుతున్న పెందుర్తి వాసులకు సోమవారం సాయంత్రం కురిసిన చిరు జల్లులు ఉపశమనం కలిగించాయి. సుమారు 20 నిమిషాలు కురిసిన వాన వారిని సేద తీర్చింది.


పెందుర్తిలో వర్షం కురుస్తున్న దృశ్యం

అప్పన్న చందనోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు

వేపగుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సింహాచలేశుడి చందనోత్సవం సందర్భంగా దేవస్థానం, జీవీఎంసీ, పోలీసు శాఖ గోశాల జంక్షన్, శ్రీనివాసనగర్‌లో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. బారికేడ్లు, మొబైల్ మరుగుదొడ్లు సిద్ధం చేశారు. స్వచ్ఛంద సంస్థలు భక్తులకు సేవలందించనున్నాయి. గోశాల జంక్షన్‌లో రూ.300, ఉచిత దర్శనం భక్తులు క్యూలైన్‌లో వెళ్లేలా ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచితంగా కొండపైకి తరలించేలా చర్యలు తీసుకున్నారు. పోలీసులకు పాయింట్లు కేటాయించారు.

పీజీఆర్ఎస్‌కు ఏడు వినతులు

వేపగుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు వినతులు అందాయని జెడ్సీ కె. హైమావతి తెలిపారు. అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలని, వసతులు కల్పించాలని విన్నవించారు. సమస్యలను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు జెడ్సీ వివరించారు.

సమస్యలను పరిష్కరించాలని ఉక్కు సీజీఎంకు వినతి

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గుర్తింపు యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నాయకులు సీజీఎం (వర్క్స్) రంజన్ మహంతికి వినతిపత్రాన్ని అందజేశారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలని, హెచ్ఆర్ఏ సమస్యను పరిష్కరించాలన్నారు. ఉద్యోగుల పీఎఫ్ ట్రస్టుకు, ఎస్ఏబీఎఫ్‌కు చెల్లించాల్సిన నగదును తక్షణమే చెల్లించాలని, అన్ని విభాగాల్లో సౌకర్యాలను కల్పించాలని కోరారు. సీజీఎంను కలిసిన వారిలో యూనియన్ అధ్యక్షుడు కేఎస్ఎన్.రావు, నాయకులు పల్లా పెంటారావు, రాంకుమార్, జగదీశ్, నాయుడు, అప్పారావు, మహాలక్ష్మినాయుడు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా ప్రసాద్‌కు అదనపు బాధ్యతలు

గాజువాక, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ అడిషనల్ చార్జి డైరెక్టర్ (ఫైనాన్స్)గా జీవీఎన్ ప్రసాద్‌ను నియమిస్తూ ఉక్కు మంత్రిత్వశాఖ అండర్ సెక్రటరీ సుబెందు హోటా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా ఉన్న ఎస్ఆర్‌వీజీకే గణేశ్ ఈ నెలలో పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ప్రస్తుతం డైరెక్టర్ (కమర్షియల్)గా ఉన్న ప్రసాద్‌కు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఈ నియామకం మే ఒకటి నుంచి జూలై 31వ వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు అమలులో ఉంటుందన్నారు.

రాసాలమ్మ కాలనీని 22ఏ నుంచి తొలగించాలని వినతి

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు పరిధి రాసాలమ్మ కాలనీని 22/ఏ నుంచి తొలగించడంతో పాటు దశాబ్దాలుగా ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరి సూర్యనారాయణ ఆధ్వర్యంలో కాలనీవాసులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కాలనీలో దశాబ్దాలుగా ఇళ్ల పట్టాల కోసం పోరాటాలు చేస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. ఈ అంశాన్ని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, తహశీల్దార్ తోట శ్రీవల్లి దృష్టికి కూడా తీసుకువెళ్లామని వారు కలెక్టర్‌కు వివరించారు.

ఎన్ఎంయూ కార్మికుల రిలే నిరాహార దీక్షలు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఆర్టీసీ స్టీల్ సిటీ డిపోలో రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ డిపో అధ్యక్ష, కార్యదర్శులు జీఎస్ఆర్ కృష్ణ, జి.సాయిరామ్‌లు మాట్లాడుతూ 2019 ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను తక్షణమే అమలు చేయాలలి, పాత పద్ధతిలోనే వైద్య సేవలను అందించాలని, గ్యారేజీలో అన్ని రకాల టూల్స్‌ను అందుబాటులో ఉంచాలని, సరిపడా సిబ్బందిని నియమించాలని, మహిళా సిబ్బందికి చైల్డ్ కేర్ సెలవులు ఇప్పించడంతో పాటు పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. నాయకులు ఎంఎస్ వాసు, బీఆర్ రావు, ఉమాదేవి, సత్య, రాము, మూర్తి, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
● **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
● **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, మోహిని (గాజువాక)
● **జాక్ :** రమాదేవి
● **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 15, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 22, పచ్చిమిర్చి 20, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 26, క్యాబేజీ 14, క్యారెట్ 36 దొండకాయలు 18, బంగాళదుంపలు 17, అరటి కాయ 8, మునక్కాడలు (కిలో) 34, అల్లం 48, బరబాటి 22, ముల్లంగి24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 52, దోసకాయలు 18, వెల్లుల్లి 100, కొబ్బరికాయ 25, బీన్స్ 58, కీరదోస 24, కాప్సికమ్ 48, పొట్లకాయ 28, చేమదుంపలు40 చిలగడదుంపలు 34, కంద 80, దేముడు చిక్కుడు 64, గోరుచిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

కొలిక్కి రాని వృద్ధ దంపతుల హత్య కేసు

స్కూటీ జాడలేదు.. ఇంట్లో 30 తులాల బంగారం, రూ.10 వేలు భద్రం

8 బృందాలుగా ఏర్పడి విచారణ సాగిస్తున్న పోలీసులు

కూర్మన్నపాలెం, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధి రాజీవ్ నగర్‌లో జరిగిన వృద్ధ దంపతుల హత్య కేసు పోలీసులకు పెను సవాల్‌గా మారింది. హత్యకు గురైన యోగీంద్రబాబు (66), లక్ష్మి (52)లకు స్కూటీ కనిపించకపోవడం.. ఆ ఇంట్లో 30 తులాల బంగారం, పదివేల రూపాయలు భద్రంగానే ఉండడంతో జంట హత్యలను ఎందుకోసం, ఎవరు చేశారన్నది ప్రశ్నార్థకంగా మారింది. అమెరికా నుంచి వచ్చిన వృద్ధ దంపతుల పిల్లలు సుజిత్, శిల్పిలు తమ ఇంట్లో బంగారం, నగదుతో పాటు ఏ వస్తువులూ చోరీకి గురి కాలేదని పోలీసులకు తెలిపినట్టు తెలిసింది. తమ తల్లిదండ్రులకు ఎవరితో ఎలాంటి గొడవలు లేవని చెప్పినట్టు సమాచారం. అదేవిధంగా స్థానికులు కూడా యోగీంద్రబాబు, లక్ష్మి (52) దంపతులకు ఎవరితోనూ ఎటువంటి విభేదాలు లేవని చెబుతున్నారు.

అయినప్పటికీ వారిని ఎవరు దారుణంగా హతమార్చారో అంతుచిక్కని మిస్టరీగా మారింది. హత్యలకు పాల్పడిన దుండగులు కనీసం ఎలాంటి క్లూ దొరకకుండా జాగ్రత్త పడడంతో పోలీసులు ఈ కేసును ఛేదించేందుకు తలలు పట్టుకుంటున్నారు. కనీసం పరిసర ప్రాంతాల్లో ఎక్కడా సీసీ కెమెరాలు కూడా లేకపోవడంతో ఈ కేసులో ఎలా ముందుకు వెళ్లాలోనని పోలీసులు మల్లగుల్లాలు పడుతు న్నారు. జంట హత్యలు జరిగి నాలుగు రోజులైనా ఈ కేసుకు సంబంధించి ఎలాంటి పురోగతి కనిపించలేదు. ఈ కేసును ఛేదించేందుకు గాను పోలీసులు 8 బృందాలుగా ఏర్పడి వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. స్కూటీ కనిపించకపోవడంతో ఆ దిశగా కూడా విచారణ సాగిస్తున్నారు. కాగా వృద్ధ దంపతులకు సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.

శానిటరీ సూపర్‌వైజర్ సేవలు ప్రశంసనీయం

అగనంపూడి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ గాజువాక జోనల్ శానిటరీ సూపర్‌వైజర్ (ఎస్ఎస్) బీవీ రామారావు సేవలు అమోఘమని ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్ కొనియాడారు. పదవీ విరమణ చేయనున్న రామారావును 85వ వార్డు పారిశుధ్య కార్మికుల సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏఎంహెచ్‌వో మాట్లాడుతూ జోన్ పరిధిలో రామారావు విశేషమైన సేవలందించారన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య, సచివాలయాల సిబ్బంది, స్థానిక నాయకులు బి.సత్యనారాయణ, కె.పైడిరాజు, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేత

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మానసిక వికాసానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని భెల్ హెచ్‌పీవీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.సుబ్రహ్మణ్యం అన్నారు. సంస్థలోని కార్మికులు, వారి పిల్లలకు నిర్వహించిన క్రికెట్, వాలీబాల్ పోటీల విజేతలకు సోమవారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సంక్షేమంతో పాటు వారి కుటుంబాల అభ్యున్నతికి భెల్ యాజ మాన్యం అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. కార్యక్రమంలో కె.ముత్యాలనా యుడు,కె.చంద్రశేఖర్, కార్మిక నాయకులు కొల్లి దేముడు, బి.బాబూరావు, పీవీఎస్ రాజు,ప్రకాశ్, రవీంద్రబాబు, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బీమా పరిహారం


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడి కుటుంబానికి మంజూరైన రూ.5 లక్షల బీమా పత్రాన్ని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు సోమవారం అందజేశారు. తెలుగుదేశం పార్టీ సాధారణ సభ్యత్వం పొందిన ఒమ్మి వెంకట బాలాజీ మృతి చెందడంతో అతని కుటుంబానికి బీమా మంజూరయిందన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్, బొడ్డేటి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తూనికలు కొలతల శాఖ అధికారుల తనిఖీ

గోపాలపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్ర జ్యోతి): స్థానిక రైతుబజారులో తూనికలు, కొలతల శాఖ అధికారులు సోమ వారం తనిఖీలు నిర్వహించారు. వర్తకులు వినియోగిస్తున్న కాటాలను పరిశీలించారు. తూనికలు, కొలతల్లో జరిగే మోసాలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. లీగల్ మెట్రాలజీ జిల్లా ఇన్‌స్పెక్టర్ ఎస్ఎం రాధాకృష్ణ, ఎస్.ఉమాసుందరి, రైతుబజారు ఎస్టేట్ అధికారి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

'తెలుగు వెలుగు' పురస్కారానికి కొయ్యి వెంకటరమణారెడ్డి ఎంపిక


వెంకటరమణారెడ్డి

అగనంపూడి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అగనంపూడికి చెందిన కొయ్యి వెంకటరమణారెడ్డి తెలుగు వెలుగు ఉగాది మహా నంది జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మే 1న నగరంలో జరగనున్న పురస్కార మహోత్సవంలో ఈ అవార్డును ఆయనకు నిర్వాహకులు అందించనున్నారు. సామాజిక సేవా రంగంలో రమణారెడ్డి చేస్తున్న సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మేయర్‌గా పీలా బాధ్యతల స్వీకరణ

» జీవీఎంసీ కార్యాలయం వద్ద కూటమి నేతలు, కార్యకర్తల సంబరాలు


జేసీ మయూర్ అశోక్ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న మేయర్ పీలా శ్రీనివాసరావు


మేయర్ పీలాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కూటమి ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, చిత్రంలో ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు


మేయర్‌ను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం


జీవీఎంసీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆనందోత్సాహాలు


పీలా శ్రీనివాస్‌ను అభినందిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు. చిత్రంలో పీలా గోవింద్ ఉన్నారు.

అప్పన్న చందనోత్సవానికి భారీగా ఏర్పాట్లు

» నిజరూప దర్శనానికి పెద్దఎత్తున తరలిరానున్న భక్తులు

» భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

సింహాచలం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సింహాచలేశుడి చందనోత్సవానికి భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. శాంతి భద్రతల పరిరక్షణకు సుమారు 1,400 మంది పోలీసులకు విధులు కేటాయించారు. సోమవారం సాయంత్రం వారంతా సింహగిరికి చేరుకుని కేటాయించిన విధులను తెలుసుకున్నారు. ఉత్సవ నిర్వహణలో నలుగురు డీసీపీలు, ఆరుగురు అడిషినల్ ఎస్పీలు, 18 మంది ఏసీపీలు, 41 మంది సీఐలు, 110 మంది ఎస్‌ఐలు, 204 మంది ఏఎస్‌ఐలు, 410 మంది కానిస్టేబుల్స్ 104 మంది మహిళా కానిస్టేబుళ్లు, 160 మంది హోమ్‌గార్డులు, 350 మంది రోప్‌పార్టీ సిబ్బంది పాల్గొంటారు.


పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న ఏసీపీ నరసింహమూర్తి

భక్తులకు ఉచితంగా లడ్డూల పంపిణీ

చందనోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులకు ఉచితంగా లడ్డూ ప్రసాదాలను పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతిభక్తునికి దర్శనం అనంతరం దక్షిణ రాజగోపురానికి చేరువగా ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి 40 గ్రాముల బరువు కలిగిన లడ్డూలను ఉచితంగా అందజేయనున్నారు. ఈ మేరకు సుమారు లక్షన్నర పంపిణీ లడ్డూలను సిద్ధం చేస్తున్నారు. దీంతో పాటు 85 గ్రాముల బరువున్న లడ్డూను రూ.15 చొప్పున విక్రయించనున్నారు. గత ఏడాది లెక్కల ప్రకారం కొండదిగువ గోశాల కూడలి, రెండో ఘాట్‌రోడ్డు అడివివరం కూడలిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో 40 వేల లడ్డూలు విక్రయించారు. ఈ సారి భక్తుల సంఖ్య పెరుగుతుందని భావిస్తుండగా మరిన్ని లడ్డూలను సిద్ధం చేస్తున్నామని దేవస్థానం అధికారులు తెలిపారు.

సహస్ర ఘటాభిషేకానికి చినజీయర్‌స్వామి

చందనోత్సవంలో ప్రధాన భాగమైన సహస్ర ఘటాభిషేకానికి త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి హాజరుకానున్నారు. అతని సారథ్యంలో పాంచరాత్రాగమశాస్త్ర నిష్ఠాగరిష్ఠులైన శ్రీవైష్ణవులు సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం వైదికులు మూడు మణుగు(125కిలోలు) శ్రీచందనం స్వామికి పైపూతగా సమర్పిస్తారు. ఈ కార్యక్రమాలను చినజీయర్ స్వామి పర్యవేక్షిస్తారు. సహస్ర ఘటాభిషేకంలో సుమారు 400 మంది పాల్గొనేందుకు దరఖాస్తు చేశారు.

పదే పదే రెవెన్యూ, జీవీఎంసీ సమస్యలే

» సమీక్షించాలని కలెక్టర్ ఆదేశం

» పీజీఆర్‌ఎస్‌లో 252 అర్జీల స్వీకరణ

మహారాణిపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం ప్రజల నుంచి స్వీకరిస్తున్న అర్జీల్లో రెవెన్యూ, జీవీఎంసీ విభాగాలకు సంబంధించినవే ఎక్కువగా వస్తున్నందున అధికారులు సమన్వయం చేసుకుని, వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 252 అర్జీలు అందాయి. వాటిని స్వీకరించిన కలెక్టర్ అర్జీలు పునరావృతమైతే సంబంధిత అధికారులదే బాధ్యతని స్పష్టంచేశారు. అనంతరం పెండింగ్ అర్జీలపై సమీక్షించారు.

చందనోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

ఈ నెల 30న జరగనున్న సింహాచలం వరాహలక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవ ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సమీక్షించారు. భక్తుల దర్శనాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పొరపాట్లకు తావులేకుండా చందనోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డీఆర్వో భవానీ శంకర్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మంచి పాలనకు సలహాలు, సూచనలు ఇవ్వండి

నగర వాసుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేద్దాం

జీవీఎంసీ అధికారులతో మేయర్ పీలా సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మంచిపాలన అందించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ ఉన్నతాధికారులను కోరారు. మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అన్నివిభాగాల అధికారులతో సోమవారం తనచాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరవాసులకు కల్పించాల్సిన మౌలికసదుపాయాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కోరారు. ప్రతి వీధిలైటు వెలిగేలా చూడడంతోపాటు ప్రజలకు తాగునీటిసరఫరాలో ఇబ్బందిలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేసవి నేపథ్యంలో నగరంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు ఎదురవడానికి వీల్లేదని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీలో అనవసర ఖర్చులు లేకుండా చర్యలు తీసుకోవాలని, అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రతీరోజూ వార్డుల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులు, సమస్యలను తెలుసుకుంటానన్నారు. పరిశుభ్రతలో రాజీపడితే సహించేదిలేదని ప్రజారోగ్యవిభాగం అధికారులకు స్పష్టంచేశారు. ప్రజలపై అదనపు భారం లేకుండా జీవీఎంసీకి ఆదాయం పెంచేందుకు అందుబాటులో ఉన్న వనరులను గుర్తించాలని రెవెన్యూ విభాగం అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సీసీపీ ప్రభాకర్, చీఫ్ ఇంజనీర్ శివప్రసాదరాజు, చీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) ఎస్.శ్రీనివాసరావు, అదనపు కమిషనర్లు రమణమూర్తి, ఎస్ఎస్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.


ఏయూ విద్యార్థుల బంగారు పతకాలకు నగదు సహాయం


వీసీకి చెక్కు అందజేస్తున్న శశికళ

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం లైబ్రరీ సైన్స్ విభాగం ఎంఎల్ఐసీ కోర్సులో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి బంగారు పతకాన్ని అందించాలని కోరుతూ ఆ విభాగానికి చెందిన విశ్రాంత ప్రొఫెసర్ సి.శశికళ రూ.1.5 లక్షల చెక్కును వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్‌కు అందించారు. తమ తల్లిదండ్రులు చాగరి నవనీతమ్మ, నారాయణరెడ్డి పేరుతో చాగరి అండ్ ఎన్‌రెడ్డి గోల్డ్‌మెడల్‌గా బహూకరించాలని కోరారు. అలాగే స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్‌గా సేవలందిస్తున్న డాక్టర్ వైఆర్‌రెడ్డి హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి బంగారు పతకాన్ని అందించాలని కోరుతూ వీసీకి రూ.15 లక్షల చెక్‌ను అందించారు. తమ తల్లిదండ్రులు వై.సీతారామమ్మ, వెంకట రమణారెడ్డి పేరు మీదుగా వైఎస్అండ్‌వైవీఆర్ గోల్డ్ మెడల్‌గా బహూకరించాలని వీసీని కోరారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు పాల్గొన్నారు.

నగరంలో కాలుష్యం తగ్గించేలా కృషి చేయాలి

రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో కాలుష్యం తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ కాలుష్యనియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ అధ్యక్షతన జరిగిన జాతీయ క్లీన్ ఎయిర్‌ప్రోగ్రామ్ అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో కాలుష్య కారక పరిశ్రమలు, సంస్థలు, శాఖల అధికారులు మరింత అప్రమత్తంగా పనిచేయాలన్నారు. జిల్లాలో గాలి నాణ్యతను మెరుగుపర్చడానికి సమష్టి బాధ్యత తీసుకోవాలన్నారు. గత మూడు నెలలుగా నగరంలో గాలినాణ్యత ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. సమీక్షలో కాలుష్య నియంత్రణమండలి చీఫ్ ఇంజనీరు ప్రసాదరావు, ఎస్ఈలు నాగిరెడ్డి, రామారావునాయుడు, మహేష్, ఈఈ పి.ముకుందరావు, అధికారులు పాల్గొన్నారు. ఉదయం కృష్ణయ్య నడుపూరులోని మెడ్‌టెక్ పార్కును సందర్శించారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ఠ చర్యలు

గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ చౌదరి

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కేవీవీ చౌదరి పేర్కొన్నారు. గ్రామీణ మండలాల పరిధిలోని 262 గ్రామాల్లో 55,833 జనాభాకు అవసరమైన నీటి పథకాల నిర్వహణ, మరమ్మతులకు రూ.4.63 కోట్లు కేటాయించామన్నారు. ఐదు సమగ్ర నీటి పథకాలు, 136 పీడబ్ల్యుఎస్ పథకాలు, 131 ఎంపీడబ్ల్యుఎస్ పథకాలు, 2,592 చేతిపంపులుండగా 2,521 పనిచేస్తున్నాయని అన్నారు. క్రాష్ ప్రోగ్రామ్‌లో భాగంగా అన్ని చేతిపంపులు తనిఖీచేసి 165 మరమ్మతులు చేశామన్నారు. నీటి ఎద్దడి ఎక్కువగా ఉండే గ్రామాలు లేవని, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడంలేదన్నారు. పంచాయతీలకు వచ్చే 15వ ఆర్థిక సంఘం నుంచి 11 బోర్‌వెల్స్ వేయాలని ప్రతిపాదించామన్నారు. తాగునీటి ఎద్దడి, పథకాల నిర్వహణ పై ఫిర్యాదులు స్వీకరించడానికి ఈఈ కార్యాలయంలో కాల్‌సెంటర్ ఏర్పాటు చేశామని 9491754525 (హరి), 9290707237 (మధు) నంబర్లకు ఫోన్ చేసి సమస్య వివరించాలన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా కోట్ని బాలాజీ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌గా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అనకాపల్లి మండలం బవులవాడ గ్రామానికి చెందిన బాలాజీ చాలా ఏళ్ల నుంచి తెలుగుదేశం పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నారు. 2013లో తెలుగు నాడు విద్యార్థి సంఘం (టీఎన్ఎస్ఎఫ్) ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షునిగా వ్యవహరించారు. అదే ఏడాది రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో జేఏసీ తరఫున పోరాటం చేశారు. టీడీపీ భీమిలి నియోజకవర్గ పరిశీలకునిగా, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రతినిధిగా సేవలు అందించారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేశారు. పార్టీకి ఆయన అందించిన సేవలకుగాను ప్రభుత్వం డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమించింది.

మహనీయుల జాబితాలో గురజాడ, కందుకూరి పేర్లను విస్మరించారు

సాహితీ స్రవంతి సమావేశంలో తెలకపల్లి రవి


సమావేశంలో మాట్లాడుతున్న తెలకపల్లి రవి. పక్కన మాజీ ఎమ్మెల్సీ శర్మ, ఇతర సభ్యులు.

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే జయంతులు, వర్ధంతులకు సంబంధించి ఇటీవల విడుదల చేసిన మహనీయుల జాబితాలో గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం వంటి ప్రముఖుల పేర్లు లేవని, ఇది చాలా అభ్యంతరకరమని సీనియర్ పాత్రికేయులు, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి అన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం సాహితీ స్రవంతి సంస్థ నిర్వహించిన 'ఉత్తరాంధ్ర సాహితీ వీచిక' సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైతాళికులుగా పేరొందిన వారినే విస్మరించడాన్ని సాహితీలోకం జీర్ణించుకోలేకపోతున్నదన్నారు. ఆ జాబితాలో సరోజినిదేవి, డొక్కా సీతమ్మ వంటి వారి పేర్లు కూడా లేవన్నారు. సవరించి కొత్త జాబితా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వందేళ్లు పూర్తి చేసుకున్న ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉత్సవాలకు రాష్ట్ర పెద్దలు హాజరు కాకపోవడం ఆక్షేపణీయమన్నారు. ఆ రోజున విశాఖలోనే ఉన్న సీఎం చంద్రబాబు వచ్చి ఉంటే బాగుండేదన్నారు. గ్రంథాలయాల పునరుద్ధరణకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. మీడియా భావ ప్రకటన స్వేచ్ఛపై సుప్రీంకోర్టు కూడా ఆందోళన వ్యక్తం చేయాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. కశ్మీర్‌లో ఘటనను మతంపై దాడిగా చిత్రీకరిస్తున్నారని, అది దేశంపైనే దాడి అని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ శర్మ, సాహితీ స్రవంతి సభ్యులు చలపతిరావు, రామారావు పాల్గొన్నారు.

క్రైం... crime news

విద్యుత్ స్తంభం పైనుంచి పడి వ్యక్తి మృతి

» అసిస్టెంట్ లైన్‌మన్‌ను సస్పెండ్ చేసిన అధికారులు


వెంకటరమణ (ఫైల్)

మధురవాడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు చేపట్టేందుకు విద్యుత్ స్తంభం ఎక్కిన వ్యక్తి పైనుంచి జారిపడి మృతిచెందాడు. కొమ్మాదిలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పీఎం పాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు... శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం గోకర్ణపల్లికి చెందిన దువ్వల వెంకటరమణ (27) ఉపాధి రీత్యా కొమ్మాదిలో నివాసముంటున్నాడు. రోజువారీ విద్యుత్ సహాయ పనులు చేస్తుంటాడు. ఈ నెల 25న కొమ్మాది విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి హుద్‌హుద్ కాలనీలో విద్యుత్ సమస్య ఏర్పడడంతో అదే సబ్‌స్టేషన్ సహాయ లైన్‌మన్ కె.సుధాకర్ సూచన మేరకు వెంకటరమణ స్తంభం ఎక్కాడు. మరమ్మతులు చేస్తుండగా, పట్టుజారి కిందకు పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన వెంకటరమణను సిబ్బంది ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం ఉదయం కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అవివాహితుడైన వెంకటరమణ తన సంపాదనతోనే తల్లిదండ్రులను పోషిస్తున్నాడు. మృతుడి తండ్రి సూరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. కాగా సంస్థతో సంబంధంలేని ప్రైవేటు వ్యక్తిని విద్యుత్ మరమ్మతులకు తీసుకువెళ్లి, అతడి మృతికి కారణమైన కొమ్మాది సెక్షన్ అసిస్టెంట్ లైన్‌మన్ కె.సుధాకర్ ను సస్పెండ్ చేసినట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు.

హెచ్‌పీసీఎల్ పార్కింగ్ యార్డులో ఘర్షణ

» డ్రైవర్‌కు కత్తిపోట్లు

మల్కాపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్ పార్కింగ్ యార్డులో ఆదివారం అర్ధరాత్రి ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్, క్లీనర్‌కు మధ్య జరిగిన ఘర్షణ కత్తిపోట్లకు దారితీసింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ లక్ష్మణ్ సోహన్, మరో డ్రైవర్ మహ్మద్‌ముల్లాహ్‌ఖాన్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వీరి మధ్య సెల్‌ఫోన్ విషయమై చిన్నపాటి వాగ్వాదం జరిగింది. తాగిన మైకంలో డ్రైవర్ లక్ష్మణ్ ఖాన్‌పై కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడి డ్రైవర్లు మల్కాపురం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటన స్థలానికి చేరుకుని ఖాన్‌ను కేజీహెచ్‌కు తరలించి, లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

రైల్వే స్టేషన్‌లో 37.5 కేజీల గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని వారి నుంచి 37.5 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్లు దినేష్‌కుమార్ దాస్, ధనుంజయనాయుడు తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో తమిళనాడులోని కాంచీపురానికి చెందిన పి.బాబు, హెచ్.స్నేహలు గంజాయిని చెన్నైకి తరలిస్తుండగా పట్టుబడ్డారనివారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

సీతంపేటలో చోరీ..

సీతంపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సీతంపేటలో చోరీ జరిగింది. బీరువాలో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.50 వేల నగదును అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సీతంపేట గణేష్‌నగర్‌కి చెందిన ముత్యాల లక్ష్మి కుమార్తెతో కలిసి ఆదివారం ఇంటికి తాళం వేసి, తాళం చెవిని అక్కడే పెట్టి బయటకు వెళ్లారు. రాత్రి వచ్చి చూసేసరికి తాళం తీసి ఉంది. బీరువాలో ఒకటిన్నర తులాల బంగారం, ఏడు తులాల వెండి ఆభరణాలు, రూ.50 వేలు కనిపించలేదు. ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ రాజు కేసు నమోదు చేశారు.

మామిడిపల్లిలో విశాఖ రియల్టర్ ఆత్మహత్య

» ఆర్థిక ఇబ్బందులే కారణమని లేఖ

దేవరాపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మామిడిపల్లిలోని ప్రైవేటు రిసార్టులో విశాఖకు చెందిన రియల్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులే కారణమని లేఖ రాశారు. ఇన్‌చార్జ్ ఎస్ఐ ఆర్.ధనుంజయ్ తెలిపిన వివరాలిలా వున్నాయి. నగరంలోని సీతమ్మధారకు చెందిన నడింపల్లి సత్యనారాయణరాజు (70) నాలుగు దశాబ్దాలుగా రియల్ వ్యాపారం చేస్తున్నాడు. ఆయనకు పలువురు డబ్బులు చెల్లించకపోవడంతో బకాయిలు రూ.కోట్లకు చేరాయి. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో తీవ్రంగా దెబ్బతిన్నాడు. దేవరాపల్లి మండలం మామిడిపల్లిలోని ఒక ప్రైవేటు రిసార్టుకు తరచూ వచ్చి పోతుంటాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఇక్కడకు వచ్చిన ఆయన రాత్రికి బసచేశాడు. సోమవారం ఉదయం రిసార్టు మేనేజర్ రాయి శివ నిద్ర లేచే సరికి గది బయట ఉన్న ఉయ్యాల కొక్కేనికి సత్యనారాయణరాజు ఉరి వేసుకొని కనిపించాడు. వెంటనే యాజమానికి ఫోన్ చేసి, ఆయన ద్వారా పోలీసులకు, సత్యనారాయణరాజు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. హెచ్‌సీ బి.ప్రకాశరావు పరిశీలించారు. ఆరుగురు వ్యక్తులను ఉద్దేశించి విడివిడిగా రాసిన లేఖలను స్వాధీనం చేసుకున్నారు. తనకు రావాల్సిన బకాయిలు, తాను చెల్లించాల్సిన బకాయిల వివరాలను ఆ లేఖల్లో పేర్కొన్నట్టు తెలిసింది. సత్యనారాయణరాజుకు భార్య విజయలక్ష్మి, కుమారుడు సాయి చైతన్య వర్మ ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌చార్జి ఎస్ఐ చెప్పారు.